RNI NO. TELTEL/2022/83470 ●manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక ఎడిటర్: మల్లె నాగిరెడ్డి




విద్యుత్ కోతలతో.. ఎండుతున్న వరి




భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

నల్గొండ హైదరాబాద్ సంపుటి : 5. సంచిక :54 శనివారం 24 అక్టోబర్ 2026 పేజీలు 8 వెల: రూ.1.00 epaper.manasakshi.in



# జులై వరకూ కరవే

- తాగుకు తప్ప.. సాగుకు నీరు లేదు
- ప్రజల్ని అప్రమత్తం చేయకుండా ఎదుర్కోలేం
- కరవుపై భారాస తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టాలి
- ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- యాదాద్రి ప్లాంట్ల వెనుక రూ.లక్ష కోట్ల అవినీతికి కేసీఆర్ ప్రణాళికంటూ ఆరోపణ
- జ్ఞానేశ్ గోబ్యాక్ నినాదంతో రాహుల్‌గాంధీ పోరాటం
- నవంబరు 1న దిల్లీ సభకు భారీగా తరలివెళ్లాలని సీఎం పిలుపు

**"అక్టోబరులో మొదలైన కరవు.. వచ్చే ఏడాది జులై వరకూ ఉంటుంది. ఎండ వేడి పెరుగుతుంది. తాగునీటికి తప్ప.. సాగుకు నీరు లేదు. తాగునీటికీ కష్టాలు వస్తాయి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. సమస్య చిన్నదిగా మొదలై.. పెద్దదిగా మారుతోందని.. ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని దాచిపెడితే..అది క్యాన్సర్‌లా మారుతుందని.. ఇంతటి విపత్కర పరిస్థితుల్లో.. ప్రజలను అప్రమత్తం చేయకుండా.. వారి భాగస్వామ్యం లేకుండా ఈ కరవును ఎదుర్కోలేమన్నారు. నిజాలను ప్రజలకు వెల్లడించకపోతే.. అన్ని రకాలుగా దెబ్బతింటామని సీఎం స్పష్టం చేశారు. ప్రజాభవన్‌లో 'ఎల్‌నినో ప్రభావం, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు, సర్‌లో ఓట్ల తొలగింపు' తదితర అంశాలపై మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులతో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో సీఎం మాట్లాడారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు, ఇతర ముఖ్యనేతలు పాల్గొన్నారు.**

హైదరాబాద్: ఏమీ కప్పిపుచ్చవద్దు. మనం కరెంటు ఇచ్చినా.. భూగర్భ జలాలు లేవు. పంటలు వేస్తే పెట్టుబడి నష్టం వస్తుంది. ఆరుతడి పంటలు, కూరగాయల సాగు మాత్రమే చేయాలి. పంటలు వేయకపోయినా.. ప్రతి కుటుంబానికి పని కల్పిస్తాం. మనం ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొందాం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**మామ, అల్లుళ్లు ఇద్దరే మేధావులా?**

"ఎల్‌నినో ప్రభావం ఉత్తర తెలంగాణలో ఒకరకంగా, దక్షిణ తెలంగాణలో మరో రకంగా ఉంది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కోతీరుగా ఉంది. కచ్ ప్రాంతంలో, మహారాష్ట్రలో కొన్ని చోట్ల నీటి సరఫరాకు రేషన్‌పెట్టారు. కనీసం 20 శాతం నీటి వినియోగం తగ్గించుకోవాలని మహారాష్ట్రలో మార్గదర్శకాలు ఇచ్చారు. భారాస నేతలేమో.. 'ఇది కాంగ్రెస్ తెచ్చిన కరవు' అని ప్రకటనలు చేస్తున్నారు. మామ, అల్లుళ్లు ఇద్దరే మేధావులా? కేసీఆర్ ఫాంహౌస్‌లో ప్రణాళికలు చేస్తే.. హరీశ్‌రావు, కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. 2019లో కరోనా వచ్చినప్పుడు శాసనసభలో కేసీఆర్ మాట్లాడుతూ ఎండకొడితే ఆ వేడికి కొవిడ్ పోతుందన్నారు. చివరికి లక్షల మంది చనిపోయారు. ఇప్పుడు హరీశ్‌రావు మాటలు నమ్మి పంటలు సాగుచేస్తే.. మట్టి పోసి అంబలి కాచుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇలాంటి వ్యాఖ్యలను కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సమర్థంగా తిప్పిగొట్టాలి. రైతువేదికలకు వెళ్లి నిజాలు చెప్పాలి.మరోపక్క అప్పులు తెచ్చి.. విద్యుత్ కొందామన్నా లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లోనే పొదుపు మంత్రం పాటిస్తే.. విద్యుత్ ఆదా అవుతుంది. కార్యాలయాల్లో అవసరం లేకపోతే పగటిపూట ఒక ట్యూబ్‌లైట్ కూడా వేయవద్దు. ఏసీలు తగ్గించాలి. మా సొంత ఊరు కొండారెడ్డిపల్లి మొత్తం ఇళ్లపై సౌర విద్యుత్ పెట్టించాం. ఇళ్లలో వాడుకున్నది పోగా.. మిగిలిన కరెంటు అమ్మితే రూ.10-20 వేల దాకా ఒక్కో ఇంటికి రావడంతో దసరా దావత్ చేశారు. అన్ని గ్రామాల వారిని కొండారెడ్డిపల్లి తీసుకెళ్లి చూపించండి. మహిళా సంఘాలను భాగస్వామ్యం చేసి.. ఇళ్లపై సోలార్ పెట్టించాలి. ఈ సీజన్‌లో ఇప్పుడు 20 వేల మెగావాట్లకు పైగా విద్యుత్ డిమాండు నమోదైంది. విద్యుదుత్పత్తి చేసి ఆదుకోవాలని ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. ఈ ఎల్‌నినో రోజుల్లో గ్రామాల్లో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటుచేసి పశువులను గ్రాసం, నీరు ఏర్పాటు చేయాలి.

ప్రజాభవన్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి హాజరైన కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు

**కాంగ్రెస్ ప్రజాప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మహేశ్‌కుమార్‌గౌడ్, భట్టి విక్రమార్క**

**వీహెచ్‌విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. సాధ్యమైనంత వరకూ స్వీయ నియంత్రణ పాటించాలి. ప్రజలకు వాస్తవాలు వివరించండి.**

**బొగ్గు ఉత్పత్తి లేని చోట యాదాద్రి ప్లాంటు పెట్టారు**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటు నిర్మాణం వెనుక కేసీఆర్ రూ.లక్ష కోట్ల అవినీతికి ప్రణాళిక రూపొందించారు. ఆయన అనుయాయులకు 50 ఏళ్ల పాటు లాభం వచ్చేలా ప్రయత్నం చేశారు. నీళ్లు, నిధులు, నియామకాలన్నీ కేసీఆర్ కుటుంబానికి వెళ్లాయి. నీళ్లు ఫాంహౌస్‌కు, నిధులు భారాస ఖాతాకు వెళ్లాయి. బ్యాంకులో భారాసకు రూ.1,500 కోట్లున్నాయి. గాంధీభవన్‌లో జీతాలు ఇవ్వాలంటే కాంగ్రెస్‌కు కష్టంగా ఉంది. కేసీఆర్, జగదీశ్‌రెడ్డిని యాదాద్రి నిర్మాణం విషయంలో శిక్షించినా తప్పులేదు. ఎవరైనా బొగ్గు ఉత్పత్తి చేసే చోట కరెంటు ప్లాంటు పెడతారు. అలా నిర్మిస్తే యూనిట్ కరెంటు రూ.5లోపే వస్తోంది.



## అబద్ధాలతో గద్దెనెక్కిన

# కాంగ్రెస్ ప్రజలను నిండా ముంచింది

ప్రసంగిస్తున్న కేటీఆర్. వేదికపై కాలేరు వెంకటేశ్, మహమూద్ అలీ

**"అబద్ధాలు, తప్పుడు ప్రచారంతోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు దోపిడీ పాలన సాగిస్తూ ప్రజలను నిండా ముంచింది"**

ఫిల్మ్‌నగర్: అని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణభవన్‌లో శుక్రవారం జరిగిన అంబర్‌పేట నియోజకవర్గ భారాస కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. "కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలన చేతకాక అన్ని వర్గాలను కష్టాల్లోకి నెట్టింది. కరెంట్ లేక రైతులు గోస పడుతున్నారు. తాగునీటికి ప్రజలు తిప్పలు పడుతున్నారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోయినా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లయినా లేదు. ఎల్‌నినో ప్రభావంపై మేం పది నెలల ముందే ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినా పట్టించుకోలేదు. అనేక రాష్ట్రాలు ముందే జాగ్రత్తపడి ప్రాజెక్టులను నీటితో నింపితే మన రాష్ట్రంలోని ప్రభుత్వం మాత్రం ఆ పని చేయలేకపోయింది. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరి కారణంగానే ఈ దుస్థితి వచ్చింది. కాళేశ్వరం పంపులు నడిపితే కేసీఆర్‌కు పేరు వస్తుందనే భయంతోనే సీఎం వాటిని ప్రారంభించడం లేదు.కాళేశ్వరంపై కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేసింది. రాహుల్‌గాంధీని తీసుకొచ్చి మేడిగడ్డపై అబద్ధాలు చెప్పించారు. ఇకపై కాంగ్రెస్ ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదు. కాంగ్రెస్, భాజపా రెండూ ఒక్కటే. రేవంత్‌రెడ్డి సంకేతాలకు అనుగుణంగానే కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి నడుచుకుంటున్నారు. అన్నివర్గాల ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఎప్పుడు ఎన్నికలు వస్తాయా.. కేసీఆర్‌కు ఎప్పుడు ఓటు వేద్దామా.. అని ఎదురుచూస్తున్నారు. మొత్తానికి రేవంత్‌రెడ్డి హడావుడి మరో ఏడాది సాగుతుంది. ఆ తర్వాత కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారు. రాష్ట్రంలో ఎంపీటీసీ, జడ్పీటీసీ, కార్పొరేషన్ ఎన్నికలను నిర్వహించే ధైర్యం ముఖ్యమంత్రికి లేదు. కార్పొరేషన్ ఎన్నికలు పెడితే 2017లో సెంచరీ కొట్టిన తీరుగా భారాస కార్పొరేషన్లను గెలుచుకుంటుంది. త్వరలో జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో యువత కాంగ్రెస్‌ను చిత్తుగా ఓడించి భారాస అభ్యర్థులను గెలిపించాలి" అని కేటీఆర్ పిలుపునిచ్చారు.




# పల్లెకు ఊపిరి.. ఉపాధి

## ఎల్నినో ఎఫెక్ట్ వేళ..

- కూలీలకు పని కల్పించేందుకు ప్రత్యేక ప్రణాళిక
- ప్రతీ గ్రామంలో రోజుకు 60 మందికి పని
- కార్యదర్శులు, సర్పంచ్లకు బాధ్యతలు
- పనులను ముమ్మరంగా చేపట్టే పనిలో అధికారులు




# 31 లోగా కరువు మండలాల ప్రకటన

- కరువు, ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ
- ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు
- కరవు ప్రభావిత మండలాల గుర్తింపు నుంచి నీటి సంరక్షణ వరకు పటిష్ట చర్యలు
- తాగునీరు, సాగునీటి సంరక్షణకు ప్రత్యేక ప్రణాళికలు..

**ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి.. ప్రజలను చైతన్యపరచాలి రైతులకు అండగా ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

## కరవుపై ప్రణాళిక లేని

# ప్రభుత్వం



హైదరాబాద్: రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితుల వల్ల కరవు వచ్చినా ముఖ్యమంత్రి దృష్టిసారించడం లేదని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు ఆరోపించారు. ఇప్పటివరకు సీఎం, కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు పంట నష్టం జరిగిన ప్రాంతాలకు వెళ్లలేదని, ఎల్‌నినోపై ప్రభుత్వం వద్ద సరైన ప్రణాళిక లేదని విమర్శించారు. శుక్రవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. "రాష్ట్రంలో కరవు తాండవిస్తోంది. హైదరాబాద్‌లో ఇప్పటికే ట్యాంకర్లను బుక్ చేస్తున్నారు. కరెంటు కోతలతో రైతులు అల్లాడిపోతున్నారు. ఇంత జరుగుతున్నా సీఎం రేవంత్‌రెడ్డికి సరైన ప్రణాళిక లేదు. ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు అన్ని పార్టీల సూచనలు తీసుకోవాలి. కాంగ్రెస్ కుయుక్తులను తిప్పి కొట్టేందుకు నవంబరు 1న హైదరాబాద్‌లో మహా పాదయాత్ర చేస్తున్నాం. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల నిర్ణయంపై శనివారం కీలక సమావేశం ఉంది.

# 31 లోగా కరువు మండలాల ప్రకటన

హైదరాబాద్, అక్టోబర్ 23, మన సాక్షి :



ఎల్‌నినో ప్రభావంతో ఎదురయ్యే కరువును ముందుగానే అంచనా వేసి తాగునీరు, సాగునీటి లభ్యతను కాపాడటంతో పాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయం, గ్రామీణ ఉపాధి వంటి కీలక రంగాలకు రానున్న రోజుల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా శాఖల వారీగా సమగ్రంగా కార్యచరణ ప్రణాళికలు రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తీర్మానించింది. నియమిత గడువు అక్టోబర్ 31 తేదీ లోగా రాష్ట్రంలోని కరువు మండలాలను ప్రకటించడంతో పాటు, ఎల్ నినో, కరువు పరిస్థితులను చర్చించడానికి అఖిల పక్ష సమావేశం త్వరలో ఏర్పాటు చేయాలని కమిటీ తీర్మానించింది. ?రాష్ట్రంలో నెలకొన్న కరువు, ఎల్-నినో పరిస్థితులను అధిగమించేందుకు, తగిన చర్యలను సమీక్షించి ప్రభుత్వానికి సిఫార్సులు చేసేందుకు సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, సబ్-కమిటీ చైర్మన్ భట్టి విక్రమార్క అధ్యక్షతన కేబినెట్ సబ్ కమిటీ తొలి సమావేశం శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో జరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఎల్ నినో , కరువు ప్రభావం, నీటి లభ్యత, రైతులకు అందించాల్సిన ఉపశమనం, భవిష్యత్తు కార్యాచరణపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు.?ఈ సమావేశానికి సబ్-కమిటీ సభ్యులు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ధనసరి సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, సిఎస్ సంజయ్ జాజుతో పాటు సంబంధిత శాఖల కార్యదర్శులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కరవు ప్రభావిత మండలాలను శాస్త్రీయంగా గుర్తించి, నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. కరువు ప్రభావాన్ని తగ్గించి, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు సమయానికి అందించడమే లక్ష్యంగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కరువు పరిస్థితులను శాస్త్రీయంగా విశ్లేషించి, అర్హత కలిగిన మండలాలను గుర్తించాలని సూచించారు. ఇప్పటికే కరువు తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాలతో పాటు, 20 శాతానికి మించి కరువు ప్రభావం ఉన్న మండలాల పరిస్థితులను కూడా పరిశీలించాలని తెలిపారు. నిబంధనలకు అనుగుణంగా అర్హత కలిగిన మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా ప్రకటించే అంశంపై సిఫార్సులు సిద్ధం చేయాలని పేర్కొన్నారు. కరువు ప్రభావం వివిధ రంగాలపై ఎలా ఉండబోతోందో ముందుగానే అంచనా వేస్తే, ప్రజలకు అవసరమైన సహాయాన్ని సకాలంలో అందించేందుకు వీలవుతుందని చెప్పారు. అందుకే ప్రతి శాఖ తన పరిధిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. తాగునీరు, సాగునీటి అవసరాలకు ప్రాధాన్యమిస్తూ అందుబాటులో ఉన్న నీటి వనరులను జాగ్రత్తగా వినియోగించుకోవాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.

ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో విద్యుత్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను ముందుగానే గుర్తించి, అవసరమైన చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తలెత్తకుండా అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు శాఖ సిద్ధంగా ఉండాలని చెప్పారు. ప్రజలకు అవసరమైన సేవలు నిరంతరాయంగా అందించేందుకు అన్ని శాఖలు తమ అవసరాలను ముందుగానే అంచనా వేయాలని, అత్యవసర ఖర్చుల కోసం ఆర్థిక శాఖ తగిన విధంగా సహకరించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ రంగంపై కరువు ప్రభావాన్ని తగ్గించేందుకు రానున్న పంటల సీజన్‌కు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని తెలిపారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని అన్నారు. కరువు, ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖలు సమన్వయంతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమస్యలు తీవ్రరూపం దాల్చిన తర్వాత స్పందించడం కంటే, ముందుగానే వాటిని గుర్తించి నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు

ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, జిల్లాల్లో ప్రతి వారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేసి చేపట్టిన చర్యలు, కరువు నివారణ చర్యలపై జిల్లా కలెక్టర్లు తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రస్తుత నీటి ఎద్దటి నేపథ్యంలో వరి వేయవద్దని, దీనికి ఇప్పటి నుండే చర్యలు చేపట్టాలని సూచించారు. నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకునేలా రైతులకు ముందస్తు సమాచారం అందించాలని వ్యవసాయ, నీటిపారుదల శాఖలను ఆదేశించారు. గ్రామస్థాయిలో రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సాగు ప్రణాళికలు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ పథకాలను సమర్థంగా వినియోగించుకొని, కరువు పరిస్థితుల్లోనూ రైతులకు అండగా నిలిచే విధంగా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు మాట్లాడుతూ, వాస్తవ పరిస్థితులపై రైతులు, సాధారణ ప్రజానీకాన్ని చైతన్య పర్చాలని అన్నారు.
మండలాల్లో భూ గర్భ జలాల మట్టం, వేసవి తీవ్రత తదితర అంశాలపై గణాంకాలను ప్రతీ వారం నివేదికలను జిల్లాల్లో విడుదల చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు ప్రజలకు అవసరమైన సమాచారం చేరేలా ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

# భూ అక్రమాలపై ముగ్గురు రెవెన్యూ అధికారుల సస్పెన్షన్

## కఠిన చర్యలు తీసుకున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట అక్టోబర్ 23 మనసాక్షి



భూముల లావాదేవీల్లో తీవ్ర అవకతవకలు, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు రెవెన్యూ అధికారులపై జిల్లా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ కఠిన చర్యలు తీసుకున్నారు. హుజుర్ నగర్ తహసీల్దార్ బి. కవిత, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కాశీం షరీఫ్, గ్రామ పాలన అధికారి (జీపీవో) ఎస్.కె. జానీ పాషాలను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శాఖాపరమైన విచారణ పెండింగ్‌లో ఉండగానే ఈ చర్యలు చేపట్టారు.

**రికార్డులు పరిశీలించకుండానే లావాదేవీలులి**

హుజూర్‌నగర్ గ్రామం, మండల పరిధిలోని సర్వే నంబర్లు 458, 281లో భూముల లావాదేవీలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. హుజూర్‌నగర్ ఆర్డీవో సమర్పించిన నివేదికల ఆధారంగా ఈ వ్యవహారాన్ని జిల్లా యంత్రాంగం తీవ్రంగా పరిగణించింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు (ఎన్ఎస్పీ) సాగునీటి కాలువలకు సంబంధించిన భూములు, భూసంస్కరణల చట్టం పరిధిలోని భూముల విషయంలో పాత రెవెన్యూ రికార్డులు, గతంలో జరిగిన విచారణలు, న్యాయస్థానాల ఉత్తర్వులను పూర్తిస్థాయిలో పరిశీలించకుండానే లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. ప్రభుత్వ భూములను పరిరక్షించడం, భూ పరిమితి చట్ట నిబంధనల అమలును పర్యవేక్షించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయినప్పటికీ భూముల వాస్తవ స్థితి, భూ పరిమితి చట్టానికి సంబంధించిన వివరాలు, ఎన్ఎస్పీ కాలువ భూముల రికార్డులను సక్రమంగా పరిశీలించకుండా తప్పుడు ధ్రువీకరణ నివేదికలు సమర్పించినట్లు విచారణలో గుర్తించారు. అందుబాటులో ఉన్న రికార్డులు, న్యాయస్థానాల ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకపోవడాన్ని విధుల పట్ల నిర్లక్ష్యంగా భావించారు.ఎన్ఎస్పీ కాలువ భూములు, భూ పరిమితి చట్టం పరిధిలోని భూములను అక్రమంగా బదలాయించేందుకు ప్రయత్నించారనే ఆరోపణలపైనా చర్యలకు ఉపక్రమించారు. రిజిస్ట్రేషన్ సమయంలో తప్పుడు డిక్లరేషన్లు సమర్పించినట్లు వచ్చిన ఆరోపణలపై సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు క్రిమినల్ ఫిర్యాదు చేశారు.

**అక్రమాలను సహించేది లేదు**

ప్రభుత్వ భూములు, ముఖ్యంగా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూములను పరిరక్షించడం రెవెన్యూ అధికారుల ప్రధాన బాధ్యత అని కలెక్టర్ స్పష్టం చేశారు. భూ పరిమితి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం లేదా అవకతవకలకు పాల్పడితే బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# విద్యుత్ కోతలతో.. ఎండుతున్న వరి

చింతపల్లి. అక్టోబర్ 23 మనసాక్షి...



రాష్ట్రంలో విద్యుత్ కోతల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వేసిన పంటలు ఎండిపోవడంతో రైతులకు ఆత్మహత్యలే శరణ్యంగా మారాయని బి ఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్ నాయక్ అన్నారు. శుక్రవారం చింతపల్లి మండల లో వివిధ దగ్గర గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుకాలం కష్ట పడి వేసిన పంటలు సమయానికి కరెంటు లేక ఎండిపోతున్న వరి పోలాలు ఉన్న కొన్ని గంటలైనా లో-ఓల్టేజ్ సమస్య కారణం మోటార్లు కాలిపోవడం,పక్కనే కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్న రైతులకు కనీసం సాగు నీరు లేక బోర్ల కింద ఉన్న పంటలు ఎండి పోవడం చేత రైతులు ఆందోళన చెందుతున్నారు అని వారు ఆవేదన వ్యక్త పరిచారు..చింతపల్లి మండలం ప్రశాంత పూరి తండా కు చెందిన రైతుల ఎండి పోయిన వరి పంటను చూసిన కేతావత్ బీల్యా నాయక్ ఈ ప్రభుత్వం పై దుమ్మెత్తి పోశారు.తెలంగాణ రాష్ట్రంలో 24గంటల విద్యుత్ అందించి రైతుల పక్షాన పెద్దన్న పాత్ర పోషించిన కేసిఆర్ పాలన ను గుర్తు చేశారు.రైతులను అన్ని విధాలా మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కాలం వుండదని రైతు ఉసురు తాకి పోతారని రైతు ఎడ్చిన రాజ్యం.ఎద్దు ఎడ్చిన వ్యవసాయం ఎక్కువ కాలం నిలవదని సమాజానికి అన్నం పెట్టే అన్నదాత సంతోషంగా వుంటేనే ఈ రాష్ట్రం అయిన దేశం అయినా సుభిక్షంగా ఉంటుందన్నా రు.ఈ రాష్ట్రం లో నిర్లక్ష్య పాలకుల కారణంగా ఎండిపోతున్న వరి పంటలను చూసి రైతుల తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రజా సంక్షేమ పాలని

లక్ష్యంగా ముందుకు వెళ్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగాన్ని ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మోస పూరిత వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు ఆసన్నమయ్యే అన్నారు. ఇకనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతాంగాన్ని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీరి వెంట టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# నకిలీ సర్టిఫికెట్లపై నజర్

హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నకిలీ పీజీ సర్టిఫికెట్లతో క్రమబద్ధీకరణ ద్వారా రెగ్యులర్ జూనియర్ అధ్యాపకులుగా మారిన వారిని గుర్తించే ప్రక్రియను ఇంటర్ బోర్డు ముమ్మరం చేసింది. ఇప్పటికే 35 మందిని ఉద్యోగాల నుంచి తొలగించిన బోర్డు, మిగిలినవారి ధ్రువపత్రాల పరిశీలనను వేగవంతం చేసింది. ఈ కసరత్తు అనంతరం అందరి అధ్యాపకుల మార్కుల శాతాలపైనా దృష్టి పెట్టే యోచనలో ఉంది.

**డిసెంబరు నాటికి పరిశీలన పూర్తి**

రాష్ట్రంలోని 430 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2000 సంవత్సరం నుంచి పలు విడతలుగా 2014 వరకు కాంట్రాక్ట్ అధ్యాపకులుగా చేరారు. వారి ఉద్యోగాలను అప్పటి ప్రభుత్వం 2023 మేలో క్రమబద్ధీకరించింది. ఫలితంగా 3,800 మంది శాశ్వత జూనియర్ లెక్చరర్లుగా మారారు. వీరిలో ఎక్కువ మంది బిహార్, యూపీ, ఝార్ఖండ్ తదితర రాష్ట్రాల్లోని వర్సిటీల నుంచి పీజీ చేసినట్లు సర్టిఫికెట్లు సమర్పించారని, వాటిని అధికారులు సరిగా పరిశీలించకుండానే నియామక ఉత్తర్వులు అందజేశారన్న ఆరోపణలున్నాయి. దాంతో నాటి నుంచి సర్టిఫికెట్లను పరిశీలిస్తూనే ఉన్నారు. ప్రొబేషనరీ పీరియడ్ సమీపించడంతో ప్రక్రియను వేగవంతం చేశారు. అధికారులను ఇతర రాష్ట్రాల వర్సిటీలకు పంపించి... సర్టిఫికెట్లపై ధ్రువీకరణ పొందుతున్నారు. ఈ క్రమంలో నకిలీవని తేలిన 35 మందిని ఇటీవల ఉద్యోగాల నుంచి తొలగించారు. మన రాష్ట్ర వర్సిటీల సర్టిఫికెట్లు ఉంటే.. వర్సిటీ అధికారులతో స్వయంగా మాట్లాడటంతోపాటు పోలీసులతోనూ నివేదిక తీసుకుంటున్నారు. మరో 700-800 మంది ధ్రువపత్రాలను పరిశీలించాల్సి ఉందని, అందులో ఇతర రాష్ట్రాల వర్సిటీలవి 400 వరకు ఉన్నాయని బోర్డు వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రక్రియను డిసెంబరు వరకు పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు.

**ఆ లేఖలూ నకిలీవే..!**

కాంట్రాక్టు అధ్యాపకులు రెగ్యులర్ అయిన తర్వాత ఆయా వర్సిటీల నుంచి వారి సర్టిఫికెట్లు అసలువేనని ధ్రువీకరిస్తూ లిఖితపూర్వకంగా లేఖ తెచ్చుకోవాలని బోర్డువర్గాలు ఆదేశించాయి. దాంతో అధ్యాపకులు సంబంధిత లేఖలను సమర్పించారు. అయితే, పదుల సంఖ్యలో అధ్యాపకులు ఆయా వర్సిటీల అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి లేఖలు సమర్పించినట్లు తెలుస్తోంది. ఒకరు సమర్పించిన లేఖలోని కోర్సు... ఆయన ఆ రాష్ట్ర వర్సిటీలో చదివిన సంవత్సరంలో లేదని తేలినట్లు సమాచారం. ఇక ఉమ్మడి రాష్ట్రంలోని వర్సిటీల నుంచి పీజీ పూర్తిచేసిన వారు సైతం ఉత్తీర్ణత శాతాన్ని పెంచి చూపినట్లు ఆరోపణలున్నాయి.

# పిడుగుపడి వ్యక్తి మృతి

మదనపల్లి అక్టోబర్ 23 మనసాక్షి



అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం రిషి వ్యాలీ సమీపంలో గురువారం సాయంత్రం వర్షంలో చెట్టుపై పిడుగు పడటంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు.మదనపల్లె ఈశ్వరమ్మ కాలనీకి చెందిన అతావుల్లా కుమారుడు మాలిక్ చెట్టు చాటున ఉన్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది.మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ పెద్ద మృతితో భార్యా పిల్లలు అనాథలయ్యారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని బంధువులు కోరుతున్నారు.

# భద్రతే అభివృద్ధికి పునాది



అమీన్‌పూర్: పటిష్ఠమైన రక్షణ, భద్రతే అభివృద్ధికి పునాదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లోని తెలంగాణ ప్రత్యేక రక్షణ దళం(టీజీఎస్‌పీఎఫ్) 36వ ఆవిర్భావ దినోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ప్రత్యేక రక్షణ దళాల నుంచి గౌరవ వందనం స్వీకరించిన అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ప్రగతిలో ప్రత్యేక దళాల పాత్ర కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 67 సంస్థలకు రెండు వేల మందికిపైగా ఎస్‌పీఎఫ్ సిబ్బంది సేవలందిస్తున్నారని చెప్పారు.ముఖ్యంగా విద్యుదుత్పత్తి కేంద్రాల రక్షణలో వీరు సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. భద్రతా సిబ్బంది సేవల వెనుక కుటుంబ సభ్యుల త్యాగాలు మరువలేనివని వెల్లడించారు. డ్రోన్లు, కృత్రిమ మేధ, సైబర్ సాంకేతికత భద్రతా రంగంలో కొత్త సవాళ్లని.. ఈ నేపథ్యంలో శారీరక దృఢత్వంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అవసరమన్నారు. మారుతున్న సవాళ్లకు అనుగుణంగా భద్రతా సిబ్బందికి నిరంతర శిక్షణ అవసరమని.. అమీన్‌పూర్‌లో ప్రత్యేక శిక్షణ అకాడమీ ఉండటం సంతోషకరమని చెప్పారు. ఆయుధాల కంటే క్రమశిక్షణ, నిజాయతీ, బాధ్యత పోలీసులకు ముఖ్యమని తెలిపారు.

# కోటి కుటుంబానికి పరామర్శ.

మన సాక్షి ప్రతినిధి అక్టోబర్ 23,



అంబోత్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు అంబోతు కోటి శోభాయాత్ర సందర్భంగా, కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్రి నిరంజన్ రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చడం జరిగింది.ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ,వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కష్టకాలంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మనోధైర్యం కల్పించడం అభినందనీయమని గ్రామస్థులు పేర్కొన్నారు.మన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యుల కష్టసుఖాల్లో అండగా నిలబడుతూ, ఐకమత్యంతో ముందుకు సాగుతామని నాయకులు తెలిపారు.

# పల్లెకు ఊపిరి.. ఉపాధి

తుంగతుర్తి,మన సాక్షి అక్టోబర్ 23..



తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని నాగారం మండల కేంద్రంలోగ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీలకు ఉపాధి పనులు భరోసా ఇస్తున్నాయి. ఎల్నినో ఎఫెక్ట్ పంటల సాగు ఆశించిన
స్థాయిలో లేకపోవడంతో వ్యవసాయ కూలీలు, ఇతరులు ఇబ్బందులు పడవద్దన్న ఉద్దేశంతో వీబీ జీ రామ్ జి భాగంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. మండల వ్యాప్తంగా రోజుకు సగటున 434 మంది కార్మికులు ఒక్కో గ్రామంలో సగటున 31 మంది కార్మికులు పనులకు హాజరవుతున్నారు. కనీసం ఒక్కో గ్రామంలో 60 మంది కూలీలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా నిర్ణయించారు.

**కూలీల సమీకరణలో...**

కూలీల సమీకరణలో సర్పంచ్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులను భాగస్వాములను చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్యదర్శులు క్షేత్రస్థాయిలో సిబ్బందితో సమన్వయం చేసుకుం టూ పనులు కల్పించాలి. ప్రతి గ్రామ పం చాయతీలో అవసరమైన పనులను గుర్తించి, నిరం తరాయంగా అక్టోబర్ 3 నుండి జూన్ 30, 2027 వరకు ఉపాధి కల్పించేలా కార్యాచరణ ప్రణా ళికలు రూపొందించాలి. పనుల నిర్వహణ, కొల తలు పని విభజన సక్రమంగా ఉండేలా పర్యవేక్షణ పటిష్టం చేశారు. వచ్చే వారం నుంచి కార్మికుల హాజరు పురోగతి ఉండేలా ప్రణాళికలను రూపొం దించారు.

**కూలీలకు అవగాహన..**

ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీవో, ఇసి, టీఏలు బృందాలు ఏర్పాటు చేసి ప్రతీ గ్రామంలో గ్రామసభల్లో వీబీజీ రామ్ ద్వారా కల్పించే పనులపై కూలీలకు అవగాహన కల్పించడంతో పాటు వివిధ శాఖల అధికారులు అందరూ విధిగా హాజరై తమ శాఖకు అవసరమైన పనులను గుర్తిం చి ప్రణాళికలు ఇప్పటికే రూపొందించడం జరిగింది. ఆయా పనులను జీపీఎస్ లోకేషన్ తో అనుసంధానం చేస్తూ , గుర్తించిన పను లను ప్రాధాన్య క్రమంలో సూచిస్తూ వికసిత్ గ్రామ పంచాయతీ ప్రణాళికలు రూపొందించడం జరిగింది.

**జలసంరక్షణ పనులకు ప్రాధాన్యం....**

రానున్న రోజుల్లో కరువు ప్రభావం కారణం గా వీబీ జీ రామ్ జీ ద్వారా జలసంరక్షణ పను లకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ మేరకు భవిష్యత్తులో నీటి కరువు పరిస్థితులు ఏర్పడకుండా అధికారులు జలసంరక్షణ పనులు చేపడుతున్నారు. ముఖ్యంగా ఫారం పాండ్స్ 31 పరిపాలన అనుమతులు పొంది , ఇప్పటి వరకు 12 పూర్తికా వస్తుంది. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించాలని ప్రభుత్వం ఆదేశించింది దానికి అనుగుణంగా ఇప్పటికే 71 ఇంకుడు గుంతలు పూర్తి చేయడం జరిగింది,101 అమలులో ఉంది. బోర్ బావులు అడుగంటకుండా ఉండేందుకు బోరూ బావులు రిఛార్జ్ కోసం అర్హులైన చిన్న /సన్న కారు రైతుల నుండి దరఖాస్తు స్వీకరించడం జరుగుతుంది

**ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం**

**ఎలినినో ఎఫెక్ట్ తో వీబీ జీరామ్ పనుల కోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొం దించాం. ప్రస్తుతం సగటున ఒక్కోగ్రామం నుంచి 31 మంది కార్మికులు పను లకు హాజరవుతుండగా ఆ సంఖ్య 60 కి పెంచ నున్నాం.**

**రవి ఏపీవో**

**కూలీల వివరాలు**

**మొత్తం జాబ్ కార్డులు:8963**

**కూలీల సంఖ్య:18463**

**యాక్టివ్ ఉన్న జాబ్ కార్డులు:4934**

**యాక్టిక్ ఉన్న కూలీల సంఖ్య:8231**

# వైద్య వృత్తిలో కరుణ, సేవాభావం ఎంతో ముఖ్యం





**నారాయణపేటపట్టణం, అక్టోబర్23 మనసాక్షి :-**

**జిల్లా కలెక్టర్ ప్రియాంక.**

వైద్య వృత్తిలో కరుణ, సేవాభావం ఎంతో ముఖ్యమని జిల్లా కలెక్టర్ ప్రియాంక స్పష్టం చేశారు. నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి వద్ద గల ప్రభుత్వ జనరల్ జిల్లా ఆస్పత్రిలో శుక్రవారం ఎంబీబీఎస్ మూడో బ్యాచ్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ డే, వైట్ కోట్ సెర్మనీ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రియాంక ముఖ్య అతిథిగా హాజరై వైద్య విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వైద్య విద్యలో ప్రవేశం పొందడం విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రుల కృషి, పట్టుదల, ఎన్నో రోజుల శ్రమకు ఫలితమని పేర్కొన్నారు. వైద్య విద్యలో సీటు సాధించేందుకు విద్యార్థులు ఎంతో కష్టపడి చదివారని, తల్లిదండ్రులు కూడా అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటూ తమ పిల్లల భవిష్యత్తు కోసం కృషి చేశారని అన్నారు. వైద్యులుగా మారే దిశగా ప్రయాణం ప్రారంభించిన విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలలో విద్యార్థులకు వైద్య సేవలను ప్రత్యక్షంగా నేర్చుకునేందుకు మంచి అవకాశాలు ఉన్నాయని, ఆస్పత్రికి వచ్చే వివిధ రకాల కేసుల ద్వారా విస్తృతమైన అనుభవం పొందవచ్చని తెలిపారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు అందుబాటులో ఉన్నారని, విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని నైపుణ్యం కలిగిన వైద్యులుగా ఎదగాలని సూచించారు. వైద్య వృత్తిలో కరుణ, మానవత్వం అత్యంత కీలకమని కలెక్టర్ పునరుద్ఘాటించారు. ప్రతి రోగిని గౌరవంతో, ఓర్పుతో, బాధ్యతాయుతంగా చూడాలని, వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే వ్యక్తి అనేక బాధలు, ఇబ్బందులతో సతమతమవుతూ ఉంటారని గుర్తుంచుకోవాలని అన్నారు. రోగులకు చికిత్స అందించడమే కాకుండా, వారికి ధైర్యం కల్పించి, మానవీయంగా వ్యవహరించడం కూడా వైద్యుల బాధ్యత అని పేర్కొన్నారు. సమాజం వైద్యులను ఎంతో నమ్మకంతో చూస్తుందని, ఆ నమ్మకాన్ని నిలబెట్టుకునేలా ప్రతి వైద్యుడు తన వృత్తిని అంకితభావంతో నిర్వహించాలని సూచించారు. వైద్య విద్య అనేది ఎంబీబీఎస్ డిగ్రీతో ముగిసిపోయేది కాదని, జీవితాంతం నేర్చుకుంటూ ఉండాల్సిన నిరంతర ప్రక్రియ అని కలెక్టర్ తెలిపారు. వైద్యరంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, ఆధునిక చికిత్సా విధానాలు, పరిశోధనలు నిరంతరం అభివృద్ధి చెందుతున్నందున వైద్యులు తమ జ్ఞానాన్ని ఎప్పటికప్పుడు నవీకరించుకోవాలని సూచించారు. నారాయణపేట జిల్లాలో పనిచేయడం, ఇక్కడి ప్రజలకు సేవలందించడం ఒక మంచి అవకాశమని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలు, ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన వారు మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వ ఆస్పత్రులపై ఆధారపడతారని తెలిపారు. అటువంటి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందిస్తూ, సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా, బాధ్యతాయుతమైన వైద్యులుగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు.

కళాశాల అభివృద్ధికి, విద్యార్థులకు అవసరమైన సదుపాయాల కల్పనకు జిల్లా యంత్రాంగం తరఫున సహకారం అందిస్తామని కలెక్టర్ తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, విభాగాధిపతులు విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని కోరారు. చివరిగా, వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులందరూ క్రమశిక్షణ, కరుణ, సేవాభావం, నిరంతర అధ్యయనాన్ని అలవర్చుకొని సమాజానికి ఆదర్శవంతమైన వైద్యులుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ కలెక్టర్ వారికి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆదిత్య గౌడ్, ఆర్ ఎం వో బాలాజీ సింగాడే, మెడికల్ కళాశాల కు చెందిన అన్ని విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

## 26న చలో హైదరాబాద్ విజయవంతం చేయండి

**నారాయణపేటపట్టణం, అక్టోబర్23 మనసాక్షి :-**



ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 26న చలో హైదరాబాదును విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గోవిందరాజు, జిల్లా కార్యదర్శి బండమీది బలరాం పిలుపునిచ్చారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు నష్టం కలిగిస్తున్న నాలుగు లేబర్ కోడ్లను వెంటనే వెనక్కి తీసుకోవాలని కనీస వేతనం, 42 వేల రూపాయలు అమలు చేయాలని, పీఎం శ్రీ, ప్రీ ప్రైమరీ విద్యను అంగన్వాడీలకు అప్పజెప్పాలన్నారు. కాంటాక్ట్ అవుట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులందర్నీ బేషరతుగా పర్మినెంట్ చేయాలని కోరుతూ అక్టోబర్ 25 ,26 రెండు రోజుల పాటు మల్టిపుల్ డేస్ మహా ధర్నా హైదరాబాద్ లోని ఇందిరా పార్కు దగ్గర ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు ఈ ధర్నా కొనసాగుతుందని వారు తెలిపారు. నారాయణపేట జిల్లా నుంచి అక్టోబర్ 26న జరిగే మహా ధర్నాకు హాజరు కాబోతున్నట్లు వారు తెలిపారు. ఈ ధర్నాకు అంగన్వాడి, ఆశ, మధ్యాహ్నం భోజన కార్మికులు, వివోఏ ,ఆర్పీలు,ఉపాధి క్షేత్ర సహాయకులు ఔట్సోర్సింగ్ ఉద్యోగ కార్మికులు, మున్సిపల్ గ్రామపంచాయతీ , భవన నిర్మాణ కార్మికులు హామాలీలు తదితర రంగాల కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు నరహరి , జోషి , భరత్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయ మూర్తిగా ఎన్నికైన సత్యనారాయణరెడ్డికు ఘన సన్మానం.

**నారాయణపేట పట్టణం, అక్టోబర్23 మనసాక్షి :-**



నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన బిసి రెడ్డి సత్యనారాయణ రెడ్డి మెజిస్ట్రేట్ గా ఎంపికైన సందర్భంగా శుక్రవారం కోర్టు కాంప్లెక్స్ లో కేంద్ర ప్రభుత్వా న్యాయవాది రఘువీర్ యాదవ్, మాజీ పి పి ఆకుల బాలప్ప, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెనూ శ్రీ సహా ఇతర న్యాయవాదులతో కలిసి శాలువాలతో సత్కరించి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి చిన్న వయసులో చకచక తన అన్ని చదువులను ప్రథమ శ్రేణులు న్యాయమూర్తిగా ఎన్నికైన సత్యనారాయణ రెడ్డి అతి తొందరలో జ్యుడీషియల్ పరిధిలో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు. వారి ఈ ఎంపిక వారి తల్లిదండ్రులకు మరి ఎంతో గర్వకారణం అని అన్నారు. న్యాయమూర్తి బిసిరెడ్డి సత్యనారాయణ రెడ్డి నారాయణపేట లో పుట్టి పెరిగి తన ప్రాథమిక విద్యను ఉన్నత విద్యను ఇంటర్మీడియట్ విద్యను నారాయణపేటలో పూర్తి చేసుకుని ఢిల్లీలో ఫోరెన్సిక్ సైన్స్ లో గ్రాడ్యుయేట్ పూర్తి చేసుకున్న తర్వాత న్యాయవాద విద్యను పూర్తి చేసుకొని ఇటీవల న్యాయమూర్తిగా ఎన్నికైనందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. వారి ఈ ఎంపిక వారి తల్లిదండ్రులకు ఎంతో గర్వకారణం అని, ఆయన తల్లిదండ్రులు కూడా ఇంటర్మీడియట్ వరకు చదువుకొని తండ్రి స్వయంకృషితో ప్రైవేటు వృత్తిలో మోటార్ వైండింగ్ మెకానిక్ గా జీవితాన్ని ప్రారంభించి తన కుమారుడిని ఉన్నత చదువులు చదివించి న్యాయమూర్తిగా ఎంపికైనందుకు తల్లిదండ్రులు సంతోషం వెలిబుచ్చారు. న్యాయమూర్తిగా ఎంపికైన సత్యనారాయణ రెడ్డి తన వృత్తి జీవితంలో నారాయణపేటకు మరింత పేరు తేవాలని ఆకాంక్షించారు. తమ మార్గదర్శం కన్నా ఆయన కష్టమే ఆయనను ఈ స్థానానికి తీసుకువచ్చిందని అడిషనల్ పి పి మెనుశ్రీ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన న్యాయమూర్తి బిసి రెడ్డి సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ తనను ఈ మార్గంలో నడిపించిన సహకరించిన పెద్దలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పీపీ బడుగు ప్రభాకర్, న్యాయవాదులు టి రామచంద్రయ్య, సంజన, లక్ష్మీనారాయణ, లయోజన్ ఆఫీసర్ గౌడ్ కోర్ట్ కానిస్టేబుల్ విజయకుమార్ పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారమే భూ రీ సర్వే

**శివంపేట, అక్టోబర్ 23, మన సాక్షి :-**



గ్రామాలు నెలకొన్న సమస్యల పరిష్కారం కోసమే భూముల రీ సర్వే నిర్వహించనున్నట్లు నరసాపూర్ ఆర్డీవో రామకృష్ణ అన్నారు శివంపేట మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు గ్రామ సర్పంచ్ గుణం గారి రాజు ఆధ్వర్యంలో గ్రామ రీ సర్వే సభ నిర్వహించారు ఈ సమావేశంలో నర్సాపూర్ ఆర్డిఓ రామకృష్ణ మాట్లాడుతూ భూముల సమస్యలను పరిష్కరించడం కోసమే భూరి సర్వే నిర్వహించునున్నట్లు ఆయన చెప్పారు రైతుల ప్రజలందరూ సహకరించవలసిన అవసరం ఉన్నదని ఆయన విజ్ఞప్తి చేశారు భూముల సమస్యలు పరిష్కరించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన చెప్పారు రైతులు ప్రజలు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని గ్రామ రైతులకు ప్రజలకు ఆయన హామీ ఇచ్చారు ఈ సమావేశంలో తాసిల్దార్ కమలాద్రి. ఆర్ ఐ నిరంజన్. గ్రామ సర్పంచ్ గుణం గారి రాజు. మాజీ సర్పంచ్లు కొడకంచి అంజాగౌడ్. నాయకులు పటేల్ రాములు. లింగం యాదవ్ రైతులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## డే కేర్ సెంటర్‌ను సందర్శించిన జిల్లా సంక్షేమ అధికారి



**నారాయణపేటపట్టణం అక్టోబర్23 మనసాక్షి :-**

నారాయణపేట జిల్లా కేంద్రం లోని ప్రణామ్ డే కేర్ సెంటర్‌ను శుక్రవారం జిల్లా సంక్షేమ అధికారి ఎల్. రాజేందర్ గౌడ్ సందర్శించారు. వయోవృద్ధులకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. కేంద్రంలో వయోవృద్ధులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, సాయంత్రం అల్పాహారంతో పాటు రోజువారీ కార్యకలాపాలను సమీక్షించారు. ఈ సందర్భంగా వయోవృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు, అవసరాలను తెలుసుకున్నారు. పిల్లలు తమ తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన సందర్భాల్లో తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం, 2007 ప్రకారం సంబంధిత ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. వయోవృద్ధులకు న్యాయం అందేలా జిల్లా సంక్షేమ శాఖ తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం జిల్లా సంక్షేమ అధికారి వయోవృద్ధులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. వయోవృద్ధులకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు వారి ఆరోగ్యం, సంక్షేమం, గౌరవప్రదమైన జీవనానికి ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్రం నిర్వాహకులకు సూచించారు.

## అలయ్ -బలయ్ కి అందోల్ నాయకులు



**అందోలు, అక్టోబర్ 23, మనసాక్షి:**

విజయదశమి సందర్భంగా చౌటకూరు మండలంలోని ఎంఎస్ గార్డెన్‌లో శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి సి.దామోదర రాజనర్సింహ నిర్వహించిన అలయ్ --బలయ్ కార్యక్రమానికి అందోలు మండలం నుంచి భారీగా తరలివెళ్లారు. మొదటి సారిగా మండల పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు 25 కార్లలో ర్యాలీగా తరలివెళ్లడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. సుమారుగా 200 మంది కార్యకర్తలు, నాయకులు ఒకేసారి కార్యక్రమానికి చేరుకోవడం చర్చనీయాంశమైంది. మండల కాంగ్రెస్ నాయకుడు జీఆర్ శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో పార్టీ శ్రేణులంతా ఏకం కావడం విశేషం. మంత్రిని శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేసారు. మాజీ మండల పార్టీ అధ్యక్షుడు శివరాజ్, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ జీఆర్. మధుసూధన్‌రెడ్డి, రమేశ్, సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

## అమర వీరుల స్మారకంగా మెగా ఆరోగ్య శిబిరం




**ఆమనగల్లు, అక్టోబర్ 23 మనసాక్షి:**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం పోలీస్ పతాక వారోత్సవం-2026 సందర్భంగా శుక్రవారం ఆమనగల్లు బస్టాండ్‌లో మెగా ఆరోగ్య అవగాహన శిబిరాన్ని నిర్వహించారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య సేవల సంస్థ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో వైద్యులు సిబ్బంది ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చు కోవడం అనారోగ్య సమస్యల పట్ల అప్ర మత్తంగా ఉండటం వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడు కోవడంపై పలు సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ పత్య నాయక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు ఎస్ఐ సంతోష్ కుమార్ ఏఎస్సై రామ్‌రెడ్డి పోలీస్ సిబ్బంది యువత స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించ డంతో పాటు పోలీసులకు ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## నారాయణపేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి

**నారాయణపేటపట్టణం అక్టోబర్23 మనసాక్షి :-**

నారాయణపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోతున్న రైతులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని ప్రధాన డిమాండ్‌తో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో సోమవారం నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందుధర్నా నిర్వహించనున్నట్లు టిఆర్ఎస్ పార్టీ నాయకులు తెలిపారు. జిల్లాలో రైతులు సాగు చేసిన పంటలు నీరు, విద్యుత్ కొరతతో ఎండిపోతుండటంతో అన్నదాతలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతులు పెట్టుబడులు కోల్పోయి అప్పుల భారంతో సతమతమవుతున్న నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వ్యవసాయానికి 24 గంటల విద్యుత్ సరఫరా అందించి రైతుల పంటలను కాపాడాలని కోరారు. పంట నష్టాన్ని అంచనా వేసి అర్హులైన రైతులకు తగిన నష్టపరిహారాన్ని అందించాలని అన్నారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షుడు,పేట అసెంబ్లీ ఇన్‌చార్జి గవినోళ్లశ్రీనివాస్, కొడంగల్ నియోజకవర్గం టీఆర్ఎస్ఇన్‌చార్జి రాజా ప్రభాకర్, మక్తల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సీహెచ్ వెంకటన్న హాజరుకానున్నారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల బాధ్యులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై ధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

## కాంగ్రెస్ కార్యకర్తలు బి ఆర్ ఎస్ లో చేరలేదు

### ఉప సర్పంచ్ భావన గారి శ్రీనివాస్.

**శివంపేట అక్టోబర్ 23 మన సాక్షి**



కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరు కూడా టిఆర్ఎస్ పార్టీలో చేరలేదని దొంతి గ్రామ ఉప సర్పంచ్ భావన గారి శ్రీనివాస్ అన్నారు. శివంపేట మండలంలోని దొంతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు ఎవరు కూడా భారత రాష్ట్ర సమితి పార్టీలో ఎవరు కూడా చేరలేదని అన్నారు బి ఆర్ ఎస్ పార్టీలో. ఉన్న వారికే పార్టీ కాండవలు వేశారని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గ్రామ ఉప సర్పంచ్ భావన గారి శ్రీనివాస్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ నుండి పార్టీలో చేరారు అనడం సిగ్గుచేటని ఆయన ఆరోపించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు

## మా భూములు ముంచొద్దు.. మా నీళ్లు తీసుకపోవద్దు

**ఆమనగల్లు, అక్టోబర్ 23 మనసాక్షి:**



పాలమూరు ఎదురుగుండా 300 కిలో మీటర్లు కృష్ణా నది ప్రవహిస్తున్న 80 ఏండ్లుగా పాలమూరు జిల్లా రైతాంగం సాగు తాగు నీళ్ళు కోసం తండ్లాట పడుతుందని డిండి ప్రాజెక్టు పేరుతో మా భూములు ఉంచొద్దు మా నీళ్లు తీసుకపోవద్దు మా రైతాంగం పొట్ట కొట్టొద్దని రైతు ఉద్యమ నాయకుడు కల్వకుర్తి జేఏసీ చైర్మన్ అయిల్ సదానందం గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీలు మారుతున్న ప్రభుత్వాలు మారుతు న్నాయి పాలకులు మారుతున్నారు. కానీ ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగం బతుకులు మాత్రం మారడం లేదన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పాలమూరు జిల్లాను కరువు జిల్లా వలసల జిల్లాగా చేసి నీళ్ళ పంపిణీలో తీవ్రంగా అన్యాయం చేసింది. స్వరాష్ట్రంలో కూడా నల్లగొండ జిల్లా రాజకీయ నేతలు ఆధిపత్యంతో పాలమూరు రైతుల పొట్టగొట్టేలా డిండి ప్రాజెక్టు పేరుతో నీళ్ళ దోపిడికి తెరలేపారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు జిల్లా రైతుల పక్షాన ఉద్యమించడానికి ఏ రాజకీయ పార్టీ కూడా ముందుకు రాలేని దుస్థితిల్లో ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో వేలాది మంది రైతులతో ఎర్రటి ఎండలో ధర్మ సత్యాగ్రహ దీక్ష,రైతుల మహా పాదయాత్ర రైతాంగం మహాధర్నా కార్యక్రమాలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించేలా చేశాయి అని పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లా ఎమ్మెల్యేలు మంత్రులు ఎంపీలను ఏకతాటిపైకి నిలపడం లో జేఏసీ సక్సెస్ అయింది. మనం చేసే పనిలో నీతి నిజాయితీ ధర్మం ఉంది కచ్చితంగా ప్రభుత్వం మన పాలమూరు జిల్లా రైతాంగానికి న్యాయం జరుగు తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. తక్షణమే డిండి ప్రాజెక్టు రద్దు చేసి ఉమ్మడి పాలమూరు జిల్లా రైతాంగానికి న్యాయం చేయాలన్నారు. జిల్లాల మధ్యన జల వివాదాలు పరిష్కరించడం కోసం నల్లగొండ జిల్లా రైతాంగానికి నాగార్జున సాగర్ శ్రీశైలం గుర్రంపోడు ఎస్సెల్బిసి ప్రాజెక్టు ద్వారా నీళ్ళు అందించి మునుగోడు దేవరకొండ రైతాంగానికి నీళ్ళు ఇవ్వాలని సదానందం గౌడ్ సూచించారు.

# శక్తి నగర్‌లో 15 ఏళ్ల రహదారి సమస్యకు తాత్కాలిక పరిష్కారం

**వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవతో మట్టి రోడ్డు నిర్మాణం.. స్థానికులకు ఊరట**



**బోయిన్ పల్లి; అక్టోబర్ 23 (కూకట్ పల్లి )**

కూకట్‌పల్లి నియోజకవర్గం ఖైతలాపూర్ డివిజన్ పరిధిలోని శక్తి నగర్‌లో గత 15 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులకు ఎట్టకేలకు తాత్కాలిక పరిష్కారం లభించింది. వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో రహదారి నిర్మాణానికి భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు చొరవ తీసుకోవడంతో మట్టి రోడ్డు నిర్మాణం పూర్తయింది. దీంతో ఎన్నో ఏళ్లుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న కాలనీ ప్రజలకు కొంత ఉపశమనం లభించింది.

గత వారం స్థానిక డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు, రహదారి నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి, తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు తనవంతు సహకారం అందించారు. ఈ క్రమంలో నిర్మాణ పనులు పూర్తికావడంతో నూతనంగా ఏర్పాటుచేసిన రహదారిని వడ్డేపల్లి రాజేశ్వరరావు, డివిజన్ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు.

**15 ఏళ్ల నిరీక్షణకు తాత్కాలిక ఉపశమనం :**

శక్తి నగర్‌లోని వైట్ వాటర్ అపార్ట్‌మెంట్స్ సమీపంలో సరైన రహదారి లేకపోవడంతో స్థానికులు చాలాకాలంగా రాకపోకల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం చేపట్టిన ప్రయత్నాల్లో భాగంగా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మించడం ద్వారా ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించారు. రహదారి అందుబాటులోకి రావడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. కాలనీ అభివృద్ధికి భవిష్యత్తులోనూ సహకరిస్తామని, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న నాయకులకు తమ మద్దతు ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు.

**ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం:**

ఈ సందర్భంగా వడ్డేపల్లి రాజేశ్వరరావు మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడం అందరి బాధ్యత అని అన్నారు. గత 15 ఏళ్లుగా రహదారి సౌకర్యం లేక స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, అందుబాటులో ఉన్న మార్గాల ద్వారా తాత్కాలికంగా మట్టి రోడ్డు నిర్మాణానికి సహకరించినట్లు తెలిపారు.

ప్రజలకు కనీస రవాణా సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ ప్రయత్నం చేపట్టామని వివరించారు. శక్తి నగర్ కాలనీ అభివృద్ధికి అవసరమైన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తామని, ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ స్పందిస్తామని ఆయన స్పష్టం చేశారు. రహదారి నిర్మాణానికి కృషి చేసిన డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి, ఇతర నాయకులను అభినందించారు. రాబోయే రోజుల్లో కూకట్‌పల్లి లో భారతీయ జనతా పార్టీ పతాకాన్ని ఎగురవేస్తామని ఆయన పేర్కొన్నారు.

పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు డివిజన్ అధ్యక్షుడు తిరుపతి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా మోర్చా నాయకురాలు విజయ భవాని, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యంజల పద్మయ్య, ఇతర వెనుకబడిన తరగతుల విభాగం జిల్లా అధికార ప్రతినిధి కోడిచెర్ల వినోద్, భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు తూము శైలేష్, ఐలయ్య, జీవన్, శేఖర్ గుప్తా, పిట్ల మనోహర్, ఈ. సాయి, స్థానిక డివిజన్ నాయకులు రాజేందర్ గౌడ్ (బబ్లు), మనోజ్, శ్రీనివాస్ చారి, కృష్ణ యాదవ్, చక్రవర్తి, వంశీ నేతతో పాటు పలువురు కాలనీవాసులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుకు ఆర్థిక సాయం



**మహబూబ్ నగర్ టౌన్ అక్టోబర్ 23 మన సాక్షి:**

ముల్లా షాబుద్దీన్ కుటుంబానికి రూ.20 వేల చెక్కు అందజేసిన ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి గుండె సంబంధిత వ్యాధితో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్టు ముల్లా షాబుద్దీన్‌కు పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం అండగా నిలిచింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూ.20,000 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులకు అండగా నిలవడం, వారి కుటుంబాలకు భరోసా కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టు ముల్లా షాబుద్దీన్ త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం సంఘం చేస్తున్న సేవలను ప్రశంసించారు. జర్నలిస్టులకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పల్లెమోని యాదయ్య, కోశాధికారి జి. రఘు, సంఘం ప్రతినిధులు సతీష్ రెడ్డి, జాఫర్, అహద్ సిద్దీఖీ తదితరులు

## ఆకతాయిల ఆగడాలు

**అనంతగిరి అక్టోబర్ 23 మన సాక్షి**



అనంతగిరి మండలం వాయిల సింగవరం గ్రామంలోని స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల2లో ఈ దసరా సెలవల సమయంలో కొంతమంది ఆకతాయిలు పాఠశాలలోనికి ప్రవేశించి తరగతి గదులలో ఉన్నటువంటి ఫ్యాన్లను తాగునీటి పైపులను ధ్వంసం చేశారు శుక్రవారం పాఠశాల రీఓపెనింగ్ సందర్భంగా ఉపాధ్యాయులు స్కూల్ గేటు తీసి లోపలకు వెళ్లేసరికి తరగతి గదిలోని ఫ్యాన్లు మొత్తం విరిగిపోయి ఉన్నాయి అలాగే వాటర్ ట్యాంకు సంబంధించిన పైపులైను కూడా ధ్వంసం చేసినారు ఈ ఉదయం స్కూల్ హెచ్ఎం తెలియజేసినారు కావున ఈ సంఘటనకు పాల్పడిన ఆకతాయిలను వెంటనే అదుపులోనికి తీసుకొని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు తల్లిదండ్రులు కోరుచున్నారు లోగడ ఉన్నటువంటి సీసీ టీవీ కెమెరాలు పనిచేయకపోవటంతో పోకిరిల అరాచకాలు ఎక్కువయ్యాయని రాత్రి వేళలో మందుబాబులు రోడ్లపై తాగుతూ అరాచకాలు సృష్టిస్తున్నారని ప్రజలు వాపోతున్నారు సీసీటీవీ కెమెరాలు ఉన్న పనిచేయటం లేదు అని కరెంటు స్తంభాలు పై నామమాత్రంగానే మిగిలిపోయాయని వెంటనే సిసిటివి కెమెరాలు ఏర్పాటు చేయాలని గ్రామంలో అరాచకాలు సృష్టిస్తున్న వారిని చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాత్రి వేళలో బజార్ల వెంట నడవాలంటే జనం భయపడుతున్నారని ప్రజలు వాపోతున్నాగు. లోగడ పంచాయతీకి సంబంధించి నటువంటి మోటార్ స్టార్టర్ కూడా ఆకతాయిలు ఎత్తుకు పోయినారు ఇప్పటికైనా పోలీసు అధికారితో గ్రామంలోని ఒక మీటింగ్ ఏర్పాటు చేసి పాను మసాలా, గుట్కా,గంజాయి, మత్తు పదార్థాల, దొంగతనాలపై అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు

## బైక్‌ను ఢీకొట్టిన ఆటో

**పంచాయతీ కార్యదర్శికి తీవ్ర గాయాలు**

**ఆమనగల్లు అక్టోబర్ 23 మనసాక్షి:**



ఆమనగల్లు ఖానాపూర్ పలుగు గుట్ట సమీపంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది.వెల్జాల్ గ్రామ పంచాయతీ కార్యదర్శి వాజీద్ ఆమనగల్లు నుంచి వెల్జాల్‌కు తన విధులకు హాజరు కావడానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో వాజీద్ తలకు, కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆయనను ఎన్నం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

**తుంగతుర్తి మన సాక్షి అక్టోబర్ 23..**



తుంగతుర్తి నియోజకవర్గం పరిధిలోని నాగారం మండల కేంద్రంలోపోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఈనెల-26న జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని నాగారం ఎస్ఐ చిరంజీవి కోరారు. శుక్రవారం నాగారం మండల కేంద్రంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవంపై ప్రజలకు కళాబందం సభ్యులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ెతమ ప్రాణాలను త్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలు మరువలేనివి అన్నారు. పోలీసు అమర వీరుల త్యాగాలను స్మరించుకుంటూ, ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడేందుకు రక్తదానం చేయడం గొప్ప మానవతా సేవ అన్నారు. జిల్లా ఎస్పీ నరసింహ ఆధ్వర్యంలో ఈనెల--26న సూర్యాపేటలో నిర్వహించే రక్తదాన శిబిరంలో ప్రజలు, యువత స్వచ్ఛందంగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది శ్రీనివాస్, నరసింహారావు, పోలీస్ కళాబందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలి

**గరిడేపల్లి, అక్టోబర్ 23 మన సాక్షి**



గరిడేపల్లి మండల కేంద్రంలో సర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం పార్టీ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో విద్యార్థులు, యువతపై ఢిల్లీ పోలీసులు దాడి చేసి అక్రమ కేసులు పెట్టడాన్ని నిరసిస్తూ ఈ నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే సర్ ప్రక్రియను రద్దు చేయాలని, ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని కోరారు. ఎన్నికల కమిషన్ లో ముగ్గురు సభ్యులున్నప్పటికీ ఆయన ఒక్కరే నిర్ణయాలు తీసుకోవడం వల్ల దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని అన్నారు. ఢిల్లీలో నిరసన తెలుపుతున్న యువత, విద్యార్థులు, మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని, ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తున్న వారిని రక్షించాలని కోరారు. డబుల్ ఇంజన్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాల వల్ల దేశవ్యాప్తంగా ఇప్పటికే 13 కోట్ల 52 లక్షల ఓట్లు తొలగించబడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలగించిన ఓట్లను వెంటనే పునరుద్ధరించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు దోసపాటి బిక్షం, రాయరాల శ్రీనివాస్, నందిపాటి మట్టయ్య, మండవ సైదులు, బి. శ్రీనివాస్, పందిరి వీరారెడ్డి, గుండెబోయిన సైదులు, మార్కపూడి వీరస్వామి, ఎలావల నారాయణ, జిలకర పెంటయ్య, సారెడ్డి సైదిరెడ్డి, బాలయ్య, ఎస్.కె. నాగులు, ఎల్. సంతోష్, కందుకూరి శ్రీనివాస్, బొడ్డుపల్లి బిక్షం, పోలేపల్లి వెంకన్న, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## మైనారిటీ బాలికల విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం

**మహబూబ్ నగర్ టౌన్ అక్టోబర్ 23 మన సాక్షి:**



వీరన్నపేటలో బాలికల మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల నిర్మాణానికి స్థల పరిశీలన మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించే లక్ష్యంతో నగరంలోని వీరన్నపేటలో నూతనంగా నిర్మించనున్న మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలల 1, 2 నిర్మాణానికి సంబంధించి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్థల పరిశీలన చేశారు. విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థినులకు మెరుగైన అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

మైనారిటీ బాలికలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, వారి విద్యాభివృద్ధికి అవసరమైన వసతి సదుపాయాలను కల్పించాలనే ఉద్దేశంతో ఈ అధునాతన విద్యాసంస్థల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థినులకు మెరుగైన విద్యావకాశాలు కల్పించడం ద్వారా వారు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు, భవిష్యత్తులో వివిధ రంగాల్లో రాణించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు.వీరన్నపేటలో నిర్మించనున్న ఈ విద్యాసంస్థలు అందుబాటులోకి వస్తే మైనారిటీ బాలికలకు విద్యతో పాటు మంచి వసతి సౌకర్యాలు లభించనున్నాయి. తద్వారా విద్యార్థినులు తమ చదువుపై మరింత దృష్టి సారించేందుకు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు అనుకూలమైన వాతావరణం ఏర్పడనుంది. బాలికల విద్యాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యారంగంలో సమాన అవకాశాలు అందించడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ స్థల పరిశీలన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

**జిల్లా ఎస్పీ డి.జానకి**



**మహబూబ్ నగర్ టౌన్ అక్టోబర్ 23 మన సాక్షి:**

పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. రక్తదానం అనేది మరొకరి ప్రాణాలను కాపాడే మహత్తరమైన సేవా కార్యక్రమమని, రక్తదానం చేయడం ద్వారా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులకు, ప్రమాద బాధితులకు, ఇతర వైద్య అవసరాలున్న వారికి ప్రాణదానం చేయవచ్చని పేర్కొన్నారు. రక్తదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, ఆరోగ్యపరంగా అర్హులైన వారు స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం సేవాభావానికి, సామాజిక బాధ్యతకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. సమాజ శ్రేయస్సు కోసం పోలీసు శాఖ శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజాసేవా కార్యక్రమాల్లోనూ ముందుంటుందని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన దాతలకు జిల్లా ఎస్పీ సర్టిఫికెట్లను ప్రదానం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రంగా అజ్మీర్, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణారెడ్డి, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ ఇజాజ్ ఉద్దీన్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొని స్వచ్ఛందంగా రక్తదానం చేశారు.

## రైతుల దీక్షకు మద్దతుగా కళాకారుల సంఘీభావం



**గరిడేపల్లి అక్టోబర్ 23 మనసాక్షి**

గరిడేపల్లి మండల కేంద్రంలో తాసిల్దార్ కార్యాలయం ముందు కళాకారుడు బాదనర్సయ్య 34 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్న బాధితులకు మద్దతు తెలియజేస్తూ కళాకారుల .తన భూమి కోసం తన భుక్తి కోసంతన హక్కుల కోసం పోరాటం చేస్తున్న లక్ష్మయ్య భద్రమ్మకు మద్దతు తెలియజేశారు. వారు మాట్లాడుతూ నేడు రెవిన్యూ వారు నీ రాసింది రాత నీ గీసింది గీత వీడి భూమిని వాడికి రాస్తూ వాడి భూమిని వీటికి రాస్తూ గ్రామాలలో రైతులకు తగులు పెడుతున్నారు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు ఏళ్లు గడిచిపోతున్నవి ఆర్థికంగా నష్టపోతున్నారు ప్రాణాలు కోల్పోతున్నారు రెవెన్యూవీరి యొక్క స్వార్థ ప్రయోజనాల కోసం రైతులని బలి తీసుకుంటున్నారు. నర్సింగ్ బక్కయ్య పొలాన్ని వేరే వాళ్లకు పాసుబుక్కులు ఇచ్చారు నాకు పాసుబుక్ ఇయ్యమంటే నీ పొలం రోడ్డు కింద పోయిందన్నారు. మరియు ఉల్లందుల వెంకటయ్య లావుడు పట్టా ఉండి 2014 15లలో ఉండి ఉంటే 30 ఏళ్ల నుండి మీరు పొలంలో లేరని ఒక పంచనామా రిపోర్ట్ రాసి ఇన్ని లీగల్ పాస్ పుస్తకాలు ఇచ్చారు మరియు వారు కూడా జ్యోతి కి పక్క రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ ఉండి వారి పాసుపుస్తకాలు ఇవ్వటానికి పది సంవత్సరాలు దటింది ఇంతవరకు ఇవ్వలేదు.ఆ భూమిని టైటిల్లో వేరే వాళ్ల కు పాస్ పుస్తకాలు ఇచ్చారు దూత ప్రవళిక అనే ముగ్గురు అనాథ పిల్లలకి 30 రోజుల పసిగందు తల్లిదనిపోతే అమ్మమ్మ అగ్రిమెంట్ రాసిచ్చారు వీరి కి అనుకూలంగా కోర్ట్ఇచ్చింది నేటి వరకు వీరికి పాస్ పుస్తకాలు ఇవ్వలేదు. వీరి ఆర్థికంగా నష్టపోతున్నారు రైతుబంధు నష్టపోతున్నారు ఈ పేద రైతులు నష్టపోతున్నారు ప్రజలకి హక్కులని కాపాడాల్సిన అధికారులు వారే వారి స్వార్థ ప్రయోజనాల మూలాన వీళ్లు హక్కులు కాలరాయపడుతున్నది ఇట్టి అంశం పైన తాసిల్దార్ కార్తీక్ పైన బండ కవిత తాసిల్దార్ వీళ్ళ తప్పులు సపోర్ట్ చేస్తున్న తహసిల్దార్ స్రవంతి పైన తగు విచారణ చేసి వీరిని సస్పెండ్ చేయాలని తాను డిమాండ్ చేశారు. ఈ సంఘీభావం తెలియజేసే ఈ నిరాహార దీక్షలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో సుధాకర్ వెంకటయ్య తిరుపమ్మ బుర్రమ్మ ఝాన్సీ ఎంకమ్మ కోట ఉష కోట లలిత మచ్చ లక్ష్మి కోట లక్ష్మి అంజి తదితరులు పాల్గొన్నారు

# నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ ప్రియాంక.**



**నారాయణపేటపట్టణం, అక్టోబర్23 మనసాక్షి :-**

నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద నిర్మిస్తున్న నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (ఐడీఓసీ) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా భవన సముదాయంలో కొనసాగుతున్న వివిధ పనులను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి, సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

నూతన కలెక్టరేట్‌లోని మంత్రి ఛాంబర్, కలెక్టర్, అదనపు కలెక్టర్ ఛాంబర్లు, వీడియో కాన్ఫరెన్స్ హాల్, ఎన్ఐసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లలో కొనసాగుతున్న ఫర్నిచర్ పనులను కలెక్టర్ పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఛాంబర్లలో ఇంటీరియర్ డిజైన్ ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని, అవసరమైన మార్పులు చేపట్టాలని ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేస్తున్న ఫర్నిచర్, సౌండ్ సిస్టమ్ నాణ్యత, వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అనంతరం భవన సముదాయంలోని వివిధ శాఖలకు కేటాయిస్తున్న హాళ్లు, గదులను పరిశీలించారు. పై అంతస్తులో శాఖలకు కేటాయిస్తున్న గదుల వివరాలను అదనపు కలెక్టర్ శ్రీను, ఏవో అనిల్ కుమార్‌లను అడిగి తెలుసుకున్నారు. మిగిలిన శాఖలకు కూడా అవసరానికి అనుగుణంగా గదులు కేటాయించేలా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టరేట్ భవన సముదాయానికి నిరంతర తాగునీటి సరఫరా కల్పించే అంశంపై మిషన్ భగీరథ ఈఈతో ఫోన్‌లో మాట్లాడారు. భవన సముదాయానికి అవసరమైన తాగునీటి సరఫరా ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు, బ్యాంకు ఏటీఎం కేంద్రానికి కేటాయించనున్న గదులను పరిశీలించి, వాటి వినియోగానికి సంబంధించి పలు సూచనలు చేశారు.

కలెక్టరేట్ ప్రాంగణంలో హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్, సంబంధిత అధికారులతో చర్చించారు. హెలిప్యాడ్ ఏర్పాటుకు అనువైన ప్రదేశాన్ని గుర్తించి, అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.

నూతన కలెక్టరేట్ భవన సముదాయంలో మిగిలిన నిర్మాణ పనులన్నింటినీ వారం నుంచి పది రోజుల్లోగా పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులను ఆదేశించారు. పనుల పూర్తిలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ పరిశీలనలో ఆర్అండ్‌బీ ఈఈ వెంకట రమణయ్య, డీఈఈ రాములు, తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ చైర్మన్ గా వేణుగోపాల్ ముదిరాజ్

**అర్వపల్లి అక్టోబర్ 23 మన సాక్షి**



జాజిరెడ్డిగూడెం మండలం గ్రంధాలయ చైర్మన్ గా బైరబోయిన వేణుగోపాల్ ముదిరాజును నియమించి నియామక పత్రాలను అంద చేసినట్లు, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ అన్నారు. శు క్రవారం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా, చైర్మన్ నియామక పత్రాన్ని అందజేశారు. యువకులు చదువుకున్న మేధావులు గ్రంథాలయాలని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి వేల్పుల రమేష్ ముదిరాజ్, సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, అర్వపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని మనోహర్ ముదిరాజ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగా నసీర్ గౌడ్,యూత్ కాంగ్రెస్ నాయకులు, కుంభం సతీష్ ముదిరాజ్, ఆనందుల నాగరాజు, అను కంటి ఆసుపత్రి నిర్వాహకుడు, వేణు, కో మారి మల్లయ్య, అమీరుద్దీన్, ఈద కోటి ప్రసాద్, బన్నీ, యూత్ కాంగ్రెస్ నాయకులు, దేవస్థాన కమిటీల సభ్యులు, పాల్గొన్నారు

# దేవస్థాన చైర్మన్ కావాలంటే పూర్వజన్మ సుకృతం ఉండాలి

**అర్వపల్లి అక్టోబర్ 23 మన సాక్షి**



వందల సంవత్సరాల చరిత్ర కలిగిన అర్వపల్లి యోగానంద లక్ష్మి నరసింహా స్వామి దేవస్థానానికి పాలకమండలి, చైర్మన్ గా పదవి పొందాలంటే పూర్వజన్మ సుకృతం ఉండాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్ అన్నారు. శు క్రవారం మండల కేంద్రంలో లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం నూతన పాలకవర్గాశీ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వందల సంవత్సరాల చరిత్ర కలిగిన స్వయంభు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చైర్మన్ కావాలంటే రాజకీయ పలుకుబడితోపాటు దైవ అనుగ్రహం ఉండాలని అన్నారు. ఈ పదవి తీసుకున్నవారు దేవాలయ అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని అప్పుడే వారి జీవితం సంతృప్తికరంగా ఉంటుందని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో పురాతన దేవాలయాలను, వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్నామని అన్నారు, దేవస్థాన చైర్మన్ గా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బీరువాలు గోపాల్ రెడ్డి మనుమడు, బీరవోలు సోమిరెడ్డి కొడుకు, యువకుడు బీరవోలు విక్రమ్ రెడ్డి నియమించినట్లుతెలిపారు. దేవస్థానం డైరెక్టర్లుగా, కోమటిపల్లి నుండి జల జ్యోతి నరసయ్య యాదవ్, పడమటి తండా నుండి ఆంగోత్ నెహ్రూ నాయక్, జాజిరెడ్డిగూడెం నుండి నరసింగ లావణ్య సమ్మయ్య గౌడ్, తిమ్మాపురం నుండి మధుసూదన్ రెడ్డి, కొమ్మల నుండి సూరారపు సైదులను డైరెక్టర్గా నియమించారు. వీరితోపాటు దేవస్థానం ఆస్థాన అర్చకులు కమిటీ సభ్యులుగా ఉంటారని అన్నారు. ఈ సందర్భంగా నూతన చైర్మన్ బీరవుల విక్రమ్ రెడ్డి మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన, ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులకు, అందరికీ కృతజ్ఞతలు తెలిపారు, ఎంతో మహోన్నాతమైన నరసింహస్వామి దేవస్థానానికి ఎనిమిది తరాల తర్వాత చైర్మన్గా పదవి బాధ్యతలు స్వీకరిస్తున్నందుకు ఆనందంగా ఉందని అన్నారు, దేవాలయానికి పూర్వవైభవం తెస్తానని అన్నారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో, మండల పార్టీ అధ్యక్షుడు గుడిపల్లి మధుకర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వేల్పుల రమేష్ ముదిరాజ్, స్థానిక సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, బీరువాలు సోమిరెడ్డి, ఎడ్ల సైదులు, వెంకటరెడ్డి, జీడి వీరస్వామి, అర్వపల్లి టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిని మనోహర్ ముదిరాజ్, జలంధర్, కిరణ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శిగా నసి ర్ గౌడ్, సంపత్, పాల్గొన్నారు

# రోటిగడ్డ తండాలో బిఆర్ఎస్ ఫ్లెక్సీల చింపివేత

**చింతపల్లి. అక్టోబర్ 23 మనసాక్షి..**



చింతపల్లి మండల పరిధిలోని రోటి గడ్డ తండాలో బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ నేనావత్ రాజు నాయక్, వార్డు సభ్యులు గ్రామంలోని పలు వీధుల్లో విజయదశమిని పురస్కరించుకొని బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు గ్రామ ప్రజలకు విజయదశమి శుభాకాంక్షలు తెలుపుతున్న ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. గ్రామంలోని ఓర్వలేక కొందరు గురువారం రాత్రి 10 గంటల సమయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపి వేశారు. రాత్రి సమయంలో అల్లర్లు సృష్టించేందుకు పథకం ప్రకారం గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫ్లెక్సీలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తొలగించారని రోటి గడ్డ సర్పంచ్ నేనావత్ రాజు నాయక్ విలేకరుల ముందు వాపోయారు. ప్రశాంత వాతావరణంలో పండగ జరుపుకుంటుండగా గ్రామంలో అలజడి సృష్టించేందుకు కొందరు వ్యక్తులు కక్ష సాధింపు చర్యతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డారని పేర్కొన్నారు. ఈ విషయమై చింతపల్లి ఎస్ఐకి సమాచారం అందించమని సర్పంచ్ రాజు పేర్కొన్నారు. ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఫ్లెక్సీలను చింపి వేసిన వ్యక్తిపై చట్టరీత్యా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశామన్నారు.

# పొనుగోడులో ముమ్మరంగా ఓటర్ నమోదు

**గరిడేపల్లి అక్టోబర్ 23 మనసాక్షి**



పొనుగోడు బీఆర్ఎస్ గ్రామ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరంగల్ , ఖమ్మం, నల్గొండ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ నమోదు కార్యక్రమం రెండో రోజు ముమ్మరంగా కొనసాగింది. పట్టభద్రులందరూ స్వచ్ఛందగా వచ్చి దరఖాస్తులు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ఎన్నికల ముందు నిరుద్యోగులకు , ఉద్యోగులకి ఇచ్చిన హామీలని తుంగలోకి తొక్కి వారిని మోసం చేసిందన్నారు. అలవు కానీ గారడి మాటలతో గద్దెని ఎక్కి అధికారంలోకి వచ్చాక యువతని పూర్తిగా మర్చిపోయారన్నారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఈ మోసపూరిత కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ మేధావులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, పట్టభద్రులందరూ తగిన బుద్ధి చెప్పాలన్నారు. బిఆర్ఎస్ జైత్రయాత్ర ఎమ్మెల్సీ ఎన్నికలతో ప్రారంభం కానుందన్నారు. ప్రతి గ్రాడ్యుయేట్ తమ ఓటును నమోదు చేసుకొని ఓటు హక్కునీ వినియోగించుకోవాలని బిఆర్ఎస్ పార్టీకి అండగా నిలవాలని కోరారు. నిరుద్యోగుల పక్షాన నిరంతరం పోరాడే బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ అధికార ప్రతినిధి రామ్ సైదులు, వార్డు మెంబర్లు అనంతు కరుణాకర్ గౌడ్, రామ్ మధు, నాయకులు పొలంపల్లి మహా ఆంజనేయులు,భాస్కర్, నందిపాటి మధు, నరహరి, రామ్ సతీష్, పంగ నాగయ్య, పట్టభద్రులు కొత్త వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణకార శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలి

**సూర్యాపేట అక్టోబర్ 23 మనసాక్షి**



హైదరాబాదు నగరంలోని సరూర్ నగర్ గ్రౌండ్ ఎల్ బి నగర్ లో నేడు శనివారం జరిగే స్వర్ణకారుల వృత్తి పరిరక్షణకై జరిగే స్వర్ణకార శంఖారావ భారీ బహిరంగ కు జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి స్వర్ణకార సోదరులందరూ వృత్తి పరిరక్షణ, మన న్యాయమైన హక్కుల సాధన కొరకు తరలివచ్చి జయప్రదం చేయాలని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షులు తొగిటి మురళి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నో దశాబ్దాలుగా ప్రభుత్వాలకు స్వర్ణకారులు ఎదుర్కొంటున్నటువంటి సమస్యలను పలు రూపాలుగా తెలియజేసినా గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని,కార్పొరేట్ వ్యవస్థ కబంధ హస్తాల్లో బలవుతున్న స్వర్ణకార చేతి వృత్తి, ప్రభుత్వ సహకారం లేక ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. స్వర్ణకారులందరు తమ వాణిని వినిపించేలా స్వర్ణకార శంఖారావ సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్వర్ణకారులందరూ పెద్ద ఎత్తున హైదరాబాద్ మహానగరానికి తరలిరావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వానికి మనమందరం ఒకే గొంతై వినిపించేలా, ప్రభుత్వ దృష్టికి మన సమస్యలు తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పేర్కొన్నారు.

# వ్యవసాయ కార్మికులకు ఆత్మీయ భరోసా అందించాలి

**సూర్యాపేట అక్టోబర్ 23 మనసాక్షి**



భూమిలేని నిరుపేద వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12000 రూపాయల ఆత్మీయ భరోసా అందిస్తామన్న ఎన్నికల వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా వ్యవసాయ కార్మికులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకోవాలని ఆత్మీయ భరోసాతో పాటు పట్టణ ప్రాంతాల్లో కూడా ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని 10 లక్షల వరకు హెల్త్ కార్డు అందించాలని ఉపాధి హామీ కూలీల కుటుంబాలలోని పిల్లలకు కేజీ టు పీజీ వరకు ఉచిత నిర్బంధ విద్య అందించాలని కోరారు. ప్రస్తుత ఎల్ ని నో ప్రభావం దృష్ట్యా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సబ్సిడీపై నిత్య వసర వస్తువులు అందించాలని జిల్లావ్యాప్తంగా కరువు మండలాలను గుర్తించి కేంద్రం నుంచి తగు సహాయం పొందేందుకు అధికారులను అప్రమత్తం చేయాలని రానున్న వేసవి ని ,కరువును తట్టుకునేందుకు అవసరమైన అన్ని రకాల సహాయక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు రెమిడాల రాజు చామల అశోక్ రామిశెట్టి కోటయ్య లు పాల్గొన్నారు.

# సాగుభూముల సంరక్షణ పై రైతులకు అవగాహన




**చివ్వెంల అక్టోబర్ 23 మన సాక్షి**

చివ్వెంల మండల కేంద్రంలోని కుడకుడ క్లస్టర్ పరిధిలోని గాయంవారిగూడెం రైతు వేదికలో సాగుభూముల సంరక్షణ కార్యక్రమం ఖేత్ బచావో అభియాన్ లో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఉద్యానవన మరియు పట్టు పరిశ్రమ శాఖ అధికారి టి. నాగయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ సాగుభూముల సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ, నీటి వనరుల సద్వినియోగం ఎంతో ముఖ్యమని తెలిపారు.రైతులు భూసారాన్ని కాపాడుకుంటూ, నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. ఒక ఎకరం వరి పంట సాగుకు సుమారు 45 నుంచి 50 లక్షల లీటర్ల నీరు అవసరమవుతుందని, అదే నీటితో డ్రిప్ సేద్యం ద్వారా సుమారు మూడు ఎకరాల్లో కూరగాయలు సాగు చేసుకోవచ్చని వివరించారు. ఏడాది పొడవునా నీటి లభ్యత ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగు చేపడితే లాభసాటిగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి. వెంకటేశ్వర్లు, కేవీకే గడ్డిపల్లి శాస్త్రవేత్త ఎ. కిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి బి. శైలజ, ఉద్యాన విస్తరణ అధికారి సుధాకర్ రెడ్డి, ఆయిల్ పామ్ ఫీల్డ్ ఆఫీసర్ భవిష్య రైతులు ధరావత్ శ్రీనివాసు, కమల నాయక్, రమేష్, లాలోజి, నగేష్, పల్ల రమేష్,జేరిపోతుల కృష్ణయ్య, రూపాని ఉప్పలయ్య, సోమాచారి, సురేష్ పలువురు రైతులు పాల్గొన్నారు.

# డిండి ఆయకట్టు పంటలను కాపాడాలి

## కల్వకుర్తి నీటిని తక్షణమే విడుదల చేయాలి

**చింతపల్లి. అక్టోబర్ 23 మన సాక్షి...**



తీవ్ర వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావంతో డిండి రిజర్వాయర్‌లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటిపోవడంతో ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు వెంటనే నీటిని విడుదల చేసి, పంటలు ఎండిపోకుండా రైతాంగాన్ని ఆదుకోవాలని కోరారు. ఎండుతున్న పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు వర్షాభావ పరిస్థితుల కారణంగా డిండి ప్రాజెక్టు పరిధిలో నీటి కొరత తీవ్రంగా ఉందని, దీంతో ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే పంటలపై వర్షాభావ ప్రభావం పడుతున్న నేపథ్యంలో ఆలస్యం జరిగితే రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని వివరించారు. అధికారులకు ఆదేశాలు జారీ చేయాలి రైతాంగ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని మహాత్మా గాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా డిండి రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేసేలా సంబంధిత అధికారులకు తక్షణమే ఆదేశాలు జారీ చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు. ఆయకట్టు రైతులకు సాగునీరు అందించి పంట నష్టాన్ని నివారించేందుకు అత్యవసర ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం సత్వర నిర్ణయం తీసుకుని, డిండి ఆయకట్టు పరిధిలోని పంటలను కాపాడేందుకు అవసరమైన నీటిని విడుదల చేయాలని ఎమ్మెల్యే బాలు నాయక్ కోరారు.

# పాల్వాయిలో 'ఖేత్ బచావో' సదస్సు



**గుర్రంపోడు, అక్టోబర్ 23,మన సాక్షి :**

రైతులు నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకుని సాగు చేయాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు (ఏడీఏ) సరిత సూచించారు. 'ఖేత్ బచావో' అభియాన్‌లో భాగంగా శుక్రవారం పాల్వాయి గ్రామ పంచాయతీ కార్యాలయంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ నీరు అవసరమయ్యే వరి సాగుకు ప్రత్యామ్నాయంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు వంటి ఆరుతడి పంటలను సాగు చేయాలని పిలుపునిచ్చారు. మండల వ్యవసాయ అధికారి (ఎంఏఓ) మాధవరెడ్డి మాట్లాడుతూ.. రైతులు నేల పరీక్షల ఆధారంగానే సమతుల్య ఎరువులను వినియోగించాలని, రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తూ భూసారాన్ని పరిరక్షించుకోవాలని కోరారు. అనంతరం వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) భగీరథ మాట్లాడుతూ.. పంట కోత తర్వాత మిగిలిన అవశేషాలను తగలబెట్టకుండా నేలలోనే కలిపి దున్నాలని, వర్షపు నీటిని సంరక్షిస్తూ ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సత్యనారాయణ, ఉప సర్పంచ్ ప్రసాద్, గ్రామ ప్రజాప్రతినిధులు మరియు స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఫలితాల సాధనే ధ్యేయంగా బోధన సాగాలి

## జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి



**సూర్యాపేట, అక్టోబర్ 23 మనసాక్షి**

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తూ, రాబోయే ఇంటర్మీడియట్ పరీక్షల్లో గత ఏడాది కంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించేలా అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి సులోచన రాణి సూచించారు. శుక్రవారం అకాడమిక్ తనిఖీలో భాగంగా సూర్యాపేట ప్రభుత్వ జూనియర్ ప్రిన్సిపల్ పెరుమాళ్ళ యాదయ్య అధ్యక్షతన కళాశాలను సందర్శించి,కళాశాలలో విద్యా కార్యక్రమాల అమలు తీరును పరిశీలించి అధ్యాపకులకు దిశానిర్దేశం చేశారు.

కళాశాలలో విద్యార్థుల ప్రవేశాలను పెంచేందుకు కార్యాచరణ రూపొందించాలని, విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపరిచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. హాజరు నమోదును పకడ్బందీగా నిర్వహించడంతో పాటు, అధ్యాపకుల బోధనా ప్రణాళికలు, రోజువారీ విద్యా కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. గత ఏడాది విద్యా ఫలితాలను సమీక్షించి, ఈ ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ముందస్తు ప్రణాళికతో ముందుకు సాగాలని తెలిపారు.

పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల అభ్యసన ప్రగతిపై నిరంతరం దృష్టి సారించాలని సూచించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారి స్థాయికి అనుగుణంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలని స్పష్టం చేశారు. పాఠ్యాంశాల పునశ్చరణ, నమూనా ప్రశ్నపత్రాల సాధనకు తగిన సమయం కేటాయించి, విద్యార్థులు పరీక్షలను ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొనేలా తీర్చిదిద్దాలని అన్నారు. ప్రతి విద్యార్థి ప్రగతిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ, అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. కళాశాల ప్రయోగశాలలను క్రమం తప్పకుండా పర్యవేక్షించి, విద్యార్థులకు ప్రయోగాత్మక పరిజ్ఞానాన్ని అందించాలని తెలిపారు. వృత్తి విద్యా కోర్సుల్లో చదువుతున్న విద్యార్థులకు సిద్ధాంత బోధనతో పాటు ప్రాయోగిక శిక్షణను సమర్థవంతంగా అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అధ్యాపకుల పాత్ర అత్యంత కీలకమని సులోచన రాణి అన్నారు. ప్రతి విద్యార్థి సామర్థ్యాన్ని గుర్తించి, వారిలో అభ్యసన ఆసక్తిని పెంపొందిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. విద్యా ప్రమాణాల పెంపు, ఉత్తీర్ణత మెరుగుదల లక్ష్యంగా అధ్యాపకులంతా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ తనిఖీలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# అన్నమయ్య జిల్లాలో ప్రశాంతంగా ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

## జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి

**మదనపల్లె, అక్టోబర్ 23:మనసాక్షి**



అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ అత్యంత ప్రశాంతమైన వాతావరణంలో పూర్తయిందని జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి వెల్లడించారు. శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈ రోజుతో నామినేషన్ల ఘట్టం విజయవంతంగా ముగిసిందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,458 ఎంపీటీసీ నామినేషన్లు, 252 జడ్పీటీసీ నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రక్రియ సజావుగా సాగడం ఎంతో అభినందనీయమన్నారు. వాట్సాప్, ఈమెయిల్స్ మరియు ఎలక్షన్ సెల్ ద్వారా మొత్తం 77 ఫిర్యాదులు అందాయని, ఈ ఫిర్యాదులపై సంబంధిత ఎస్హెచ్ఓలు వెంటనే స్పందించి, నామినేషన్లు వేసే క్రమంలో ఎవరికీ ఎటువంటి ఆటంకాలు కలగకుండా పరిష్కరించారని తెలిపారు. 77 ఫిర్యాదులలో అభ్యర్థుల నుంచి వచ్చిన వినతుల మేరకు ప్రత్యేకంగా 28 మందికి ఎస్హెచ్ఓలు దగ్గరుండి సురక్షితంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు ఏర్పాట్లు చేశారన్నారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి నామినేషన్ల ప్రక్రియను విజయవంతం చేసిన అన్నమయ్య జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. రాబోయే ఎన్నికల ప్రక్రియ అంతా కూడా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, శాంతిభద్రతల సమస్యలు లేకుండా ప్రశాంతంగా ముగిసేలా జిల్లా ప్రజలందరూ పోలీస్ శాఖకు పూర్తి సహకారం అందించాలని ఎస్పీ ధీరజ్ కునుబిల్లి కోరారు.

# మిర్యాలగూడలో అండర్ పాస్ ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు



**మిర్యాలగూడ, అక్టోబర్ 23, మన సాక్షి**

మిర్యాలగూడ పట్టణంలో అద్దంకి – నార్కట్ పల్లి రహదారిపై రెండు చోట్ల అండర్ పాస్ ల నిర్మాణానికి తెలంగాణ ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ జీవో 545 విడుదల చేశారు. మిర్యాలగూడ పట్టణంలోని నందిపాడు జంక్షన్, చింతపల్లి ఎక్స్ రోడ్డు వద్ద ఈ అండర్పాస్ ల నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇచ్చింది. అందుకోసం 37.95 కోట్ల రూపాయలను మంజూరు చేస్తుంది. ఈ మేరకు పరిపాలన అనుమతులు లభించడంతో టెండర్లు పిలవాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించింది.

# మహ్మద్ అలీషా ఖాద్రీ దర్గాలో వైభవంగా 21 వ ఊరుసు

## గంధం మహోత్సవం.





**రామసముద్రం, అక్టోబర్ 23 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలోని పుంగనూరు రోడ్డులో ఉన్న రాగిమాకుల పల్లె క్రాస్ సమీపంలో ఉన్న పీర్ సయ్యద్ ఖాదరీ గంధం శుక్రవారం దర్గాను బెంగళూరు నుండి పలు రకాల పుష్పాలు తెచ్చి దర్గాని అలంకరణ చేసి, విద్యుత్ కాంతుల నడుమ భక్తి శ్రద్ధలతో ఉత్సవ కమిటీ వారి ఆధ్వర్యంలో గంధం మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దర్గాలో ముస్లిం మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు, బూందీ, పంచదార చెనిగిపప్పు చదివింపులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మదీనా పై గంధం ఉంచి రాగిమాకుల పల్లె క్రాస్ నుండి రామసముద్రం వరకు గంధం ను ఊరేగింపు చేశారు. ఈ వేడుక తిలకించడానికి తెలంగాణ కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ నుండి అధిక సంఖ్యలో వచ్చి గంధం వీక్షించారు. ప్రత్యేకంగా హైదరాబాద్ బృందం వారిచే గొప్ప కావ్వాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గొప్ప అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఊరుసు మహోత్సవానికి విచ్చేసిన రాజకీయ నేతలు ప్రముఖులను,హిందూ ముస్లిం సోదరులకు శాలువలు కప్పి దర్గా కమిటీ సభ్యులు ఘనంగా సన్మానం చేశారు.

# గ్రామాల్లో ఈ-శ్రమ, టెలి-లా క్యాంపులు నిర్వహించాలి

**రామసముద్రం, అక్టోబర్ 23 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా గ్రామాల్లో సీఎస్సీ వీఎల్ఈలు ఈ-శ్రమ మరియు టెలి-లా క్యాంపులను ప్రతి నెలా రెండుసార్లు నిర్వహించాలని సీఎస్సీ జిల్లా మేనేజర్ డి. సతీష్ కుమార్ సూచించారు. శుక్రవారం రామసముద్రం వీఎల్ఈ మహేష్ ఏర్పాటు చేసిన ఈ-శ్రమ క్యాంపును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్మికుడు కేంద్ర ప్రభుత్వం అందించే పీఎం విశ్వకర్మ ద్వారా రూ. 3 లక్షల ఉపాధి రుణం, ప్రధానమంత్రి శ్రమయోగి మాన్ధన్ ద్వారా 60 సంవత్సరాల తర్వాత రూ. 3 వేల పెన్షన్, ఈ-శ్రమ ద్వారా రూ. 2 లక్షల ప్రమాద బీమా పొందవచ్చని తెలిపారు. ఇంకా ఆధార్‌లో మార్పులు, చేర్పులు, న్యాయ సేవలు, లోన్ బజార్, ఇన్సూరెన్స్, అగ్రికల్చర్ సర్వీసెస్, ట్రావెల్ సర్వీసెస్ వంటి వివిధ రకాల సర్వీసుల కొరకు సమీప సీఎస్సీ సెంటర్లను సంప్రదించాలన్నారు. ప్రతి ఒక్కరూ కేంద్ర ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల భవిష్యత్ భద్రత కోసం ప్రభుత్వ పథకాలను వారి వద్దకు చేర్చే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ముందడుగు వేస్తోందని తెలిపారు.

# ఆర్ ఎం ను కలిసిన పట్నం డిపో కార్మికులు,



**ఇబ్రహీంపట్నం మన సాక్షి ప్రతినిధి అక్టోబర్ 23,**

హైదరాబాద్ ఆర్ఎం ని విజయం తర్వాత కలిసిన పట్నం డిపో కార్మికులు ఆర్టీసీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఎంప్లాయిస్ యూనియన్ బస్సు గుర్తు గెలుపొందిన సందర్భంగా రిజినల్ మేనేజర్ ఆర్ ఎం శ్రీలత ని మర్యాదపూర్వకము కలిసిన ఇబ్రహీంపట్నం ఎంప్లాయిస్ యూనియన్ డిపో కమిటీ సభ్యులు డిపో కార్యదర్శి చెరుకూరి పరమేష్ అధ్యక్షులు జిల్లా జంగయ్య సహాయ కార్యదర్శి ఈటశేఖర్, జోనల్ అడ్వైజర్ బి అశోక్, ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు కృష్ణ అసిస్టెంట్ సెక్రటరీ సిహెచ్ రమేష్, కోశాధికారి ఎర్ర బాలకిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ దూసరి వెంకటేష్‌శీ, అసిస్టెంట్ సెక్రటరీ ఎం కృష్ణ, జోనల్ అసిస్టెంట్ సెక్రటరీ సిహెచ్ యాదగిరి, ఇట్టి కార్యక్రమంలో డిపో కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది,ఆర్ఎం డిపో సమస్యల తెలియజేయగా సానుకూలంగా స్పందించారు. మీయొక్క సాహాయ సహకారాలు మాకు ఉండాలి. అదేవిధంగా మా కార్మికుల సహాయ సహకారాలు మీకు ఎల్లవేళలా అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇబ్రహీంపట్నం డిపో కమిటీ తరపున ఆర్ఎం మేడంకి కార్మికులు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

# జర్నలిస్టు వృత్తి కత్తిమీద సాము లాంటిది

**కంగ్టి,నారాయణఖేడ్, అక్టోబర్ 23, మన సాక్షి :-**



సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తున్న జర్నలిస్టుల సేవలు ప్రశంసనీయమని జీఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుల్టపు మచ్చేందర్ అన్నారు. శుక్రవారం నారాయణఖేడ్ పట్టణంలోని స్వర్ణకార భవనంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) నారాయణఖేడ్ డివిజన్ తొలి కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గుల్టపు మచ్చేందర్ కార్యవర్గ సభ్యులను సత్కరించి, బ్యాగులు పంపిణీ చేసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తూ, ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ జర్నలిస్టులు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. జర్నలిస్టు వృత్తి కత్తిమీద సాములాంటిదని అభివర్ణించారు. సమాజంలో జరిగే అన్యాయాలు, అక్రమాలు, అవినీతి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ధైర్యంగా వెలుగులోకి తీసుకురావడం జర్నలిస్టుల బాధ్యత అన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, పాలకులకు ప్రజల కష్టాలను తెలియజేసి సమస్యల పరిష్కారానికి మార్గం చూపడంలో మీడియా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఎండ, వాన, రాత్రింబవళ్లు అనే తేడా లేకుండా ప్రజలకు సమాచారాన్ని అందించేందుకు జర్నలిస్టులు నిరంతరం శ్రమిస్తున్నారని, విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లు, సవాళ్లు ఎదురైనా ప్రజాహితం కోసం పనిచేయడం గొప్ప విషయమని అన్నారు. కొన్ని సందర్భాల్లో ప్రాణాలకు సైతం తెగించి వార్తా సేకరణ చేయడం వారి వృత్తి నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. జర్నలిస్టులు సమాజ అభివృద్ధిలో భాగస్వాములుగా ఉంటూ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నారని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సూచించారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు, ప్లాట్లు, ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన బిల్లులు, ఇతర సంక్షేమ సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా పోరాడుతూ, వృత్తిపరమైన హక్కుల సాధనకు కృషి చేయాలని ఆకాంక్షించారు. సమాజానికి మేలు చేసే వార్తలకు ప్రాధాన్యతనిస్తూ, వాస్తవాలను ప్రజల ముందుంచడమే జర్నలిజం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ ఫౌండేషన్ బాద్యులు గంగారాం, మారుతి, బస్వరాజ్ పాటిల్, తుకరాం, టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మునిగాల మానిక్ ప్రభు,ఖేడ్ డివిజన్ అధ్యక్షుడు పుట్టి సంజీవ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రతాప్, ప్రధాన కార్యదర్శి యం.ఏ ఖైసర్, కోశాధికారి ఇబ్రహీం, గౌరవ అధ్యక్షుడు వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు కావాలి

**మేడ్చల్ మల్కాజిగిరి అక్టోబర్ 23 మన సాక్షి**



రానున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం బోయినపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంబీసీ చైర్మన్, నియోజకవర్గ ఇన్‌చార్జి నందికంటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. అర్హులైన పట్టభద్రులను గుర్తించి, ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకునేలా సహకరించాలని సూచించారు. అలాగే నియోజకవర్గంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, బోర్ల నిర్వహణపై దృష్టి సారించాలని తెలిపారు. డబుల్ బెడ్‌రూమ్, ఇందిరమ్మ ఇళ్ల పథకాల ద్వారా అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి నాయకులు క్షేత్రస్థాయిలో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు జగదీష్ గౌడ్, మేకల సునీత, రాము యాదవ్, శిరీష జితేందర్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



**పుల్ కల్, అక్టోబర్ 23, (మన సాక్షి):**

మండల పరిధిలోని కోదూరు గ్రామంలో సగ్గాలా నాగరాజు, సగ్గాలా దుర్గమ్మ వారం రోజుల వ్యవధి లో మరణించడం. విషయం తెలిసి స్థానిక మంత్రి దామోదర్ రాజనర్సింహ కూతురు, యువ నాయకురాలు త్రిష కు సమాచారం తెలియచేయగా ఆర్థిక సహాయం చేయడం. జరిగింది. ఈ కార్యక్రమం లో మండల్ కాంగ్రెస్ యూత్ నాయకులు ఆతుకూరి రవీందర్, ఉపసర్పంచ్ పెద్దబాగు మల్లేశం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# రామసముద్రం-2 ఎంపీటీసీగా జనసేన అభ్యర్థి వినోద్ నామినేషన్



**రామసముద్రం, అక్టోబర్ 24 మనసాక్షి**

అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం రామసముద్రం – 2 ఎంపీటీసీ స్థానానికి జనసేన పార్టీ తరపున పగడాల వినోద్ నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ కార్యకర్తలు, అనుచరులతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆర్‌ఓకు శుక్రవారం నామినేషన్ పత్రాలను సమర్పించారు.

# శ్రీ.కేతకి సంగమేశ్వర స్వామి దేవస్థాన నూతన పాలక మండలి ప్రమాణస్వీకారం

## హాజరైన ఎంపీ.సురేష్ షెట్కార్

**జహీరాబాద్,అక్టోబర్ 23, మనసాక్షి**



సంగారెడ్డి జిల్లా ఝరసంగం మండలంలో గల పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ.కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయ కమిటీ నూతన పాలక మండలి శు క్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. . కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కర్, మాజీ మంత్రి, ఎ. చంద్రశేఖర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నూతన చైర్మన్ చంద్రశేఖర్ పాటిల్ ను మరియు సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ.కేతకీ సంగమేశ్వర స్వామి ఆశీస్సులతో ఆలయ అభివృద్ధి, ఆధ్యాత్మిక కార్యక్రమాలు మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ రామలింగారెడ్డి , వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్ , హుగ్గెల్లి రాములు ,భాస్కర్ రెడ్డి , సువర్ణ-మల్లన్న పాటిల్ ,పవన్ రాథోడ్ ,మాజీ మండల అధ్యక్షులు హన్మంత్ రావ్ పాటిల్ , శ్రీనివాస్ రెడ్డి ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆర్షద్ అలీ ,బడంపేట్ రాచన్న స్వామి ఆలయ కమిటీ చైర్మన్ జగదీష్ స్వామి , కాంగ్రెస్ నాయకులు ముల్తానీ , ఆలయ కమిటీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు..

# సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీతో ఇద్దరు మృతి

**ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి' అండతో ఒక్కో కుటుంబానికి రూ.70 లక్షల పరిహారం..**

**అంతక్రియలకు జిఎంఆర్" లక్ష రూపాయల సహాయం...**



**పటాన్చెరు, అక్టోబర్ 23/(మనసాక్షి) :**

సిగాచి పరిశ్రమలో జరిగిన ఘోర ప్రమాదం తాలూకు విషాదం మరువకముందే గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని సరాక' పరిశ్రమలో గ్యాస్ లీకేజీ ఘటన చోటుచేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. కార్మికుల ప్రాణాలకు భరోసా కల్పించాల్సిన పరిశ్రమల యాజమాన్యాలు పర్యవేక్షించాల్సిన ప్రభుత్వ యంత్రాంగం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సరాక పరిశ్రమ గ్యాస్ లీకేజీ ఘటనలో మృతి చెందిన ఇద్దరు కార్మికుల కుటుంబాలకు యాజమాన్యంతో చర్చించి 70 లక్షల రూపాయల నష్టపరిహారంతో పాటు అంత్యక్రియల కోసం లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సాయం అందించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఘటనలో గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని సంబంధిత యాజమాన్యాన్ని ఆదేశించారు.సమాచారం అందుకున్న వెంటనే ఘటన స్థలానికి వెళ్లిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. పరిశ్రమ యాజమాన్యంతో పాటు వివిధ శాఖల అధికారులతో మాట్లాడి ఘటన వివరాలు తెలుసుకున్నారు. ఘటన పైన పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పటాన్చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి వెళ్లి మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. స్థానిక శాసనసభ్యుడిగా కుటుంబాలకు సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ..పారిశ్రామిక అభివృద్ధికి పటాన్చెరు ప్రాంతం కీలక కేంద్రంగా ఎదుగుతున్నప్పటికీ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. పరిశ్రమల అభివృద్ధి అంటే కేవలం ఉత్పత్తి, లాభాల పెరుగుదల మాత్రమే కాదని.. అక్కడ పనిచేసే ప్రతి కార్మికుడి ప్రాణానికి భరోసా కల్పించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా అమలవుతున్నాయా? ప్రమాదాలను ముందుగానే గుర్తించే వ్యవస్థలు పనిచేస్తున్నాయా? గ్యాస్ లీకేజీలను నివారించే రక్షణ చర్యలు తీసుకుంటున్నారా? అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే ఏర్పాట్లు ఉన్నాయా? అనే అంశాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

ప్రమాదాలపై సమగ్ర విచారణ జరిపించాలి.సరాక పరిశ్రమలో గ్యాస్ లీకేజీకి దారితీసిన కారణాలను వెలికితీయాలని, ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రతా లోపాలు ఏమైనా ఉన్నట్లయితే వాటిని గుర్తించి, బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పారిశ్రామిక ప్రాంతాల్లోని అన్ని పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.సిగాచి ఘటన నుంచి తగిన గుణపాఠాలు నేర్చుకుని కార్మికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని, వరుస పారిశ్రామిక ప్రమాదాలపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరిని విడనాడాలని విమర్శించారు.కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటాం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలను ఆదుకోవడంతో పాటు, బాధితులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటామని ఎమ్మెల్యే జీఎంఆర్ హామీ ఇచ్చారు. కార్మికుల భద్రత విషయంలో పరిశ్రమల యాజమాన్యాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రభుత్వ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.

## జోష్ గా కాంగ్రెస్ 'అలై బలై

### పాల్గొన్న మంత్రి దామోదర్ రాజనర్సింహం

**పుల్ కల్,అక్టోబర్ 23 (మన సాక్షి):**






పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ దామోదర్ రాజనర్సింహ సూచించారు. విజయదశమి పండుగ సందర్భంగా అలయ్ - బలాయ్ కార్యక్రమాన్ని చౌటుకూరు మండల పరిధిలోని సుల్తాన్పూర్ లోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గం లో అధికారం లోకి వచ్చిన తర్వాత సుమారు 3 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల లు డిజిటల్ పై కార్యకర్తలకు చూపించారు. ఇందులో వివిధ శాఖలకు చెందిన అభివృద్ధి పనులను చూపించారు. అభివృద్ధి కి చేపట్టిన కార్యక్రమా లను, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కార్యకర్తలకువివరించారు.ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు శ్రీ చంద్రశేఖర్ రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు శ్రీ సంగమేశ్వర్, పిసిసి సభ్యులు శ్రీ కిషన్, మార్క్ ఫెడ్ డైరెక్టర్ శ్రీ జగన్ మోహన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ లు శ్రీ జగన్ మోహన్ రెడ్డి, శ్రీ సుధాకర్ రెడ్డి, లక్ష్మి శేషారెడ్డి, ఆందోల్ - జోగిపేట మున్సిపాలిటీ చైర్మన్ శ్రీ కృష్ణారెడ్డి, మాజీ చైర్మన్ శ్రీ సురేందర్ గౌడ్, అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిల్లోడి సతీష్, దిగంబర రావు, శేషారెడ్డి , దుర్గారెడ్డి, గణేష్ , కేదారనాథ్, వెంకటేశం , విశ్వాస్ , విష్ణువర్ధన్ రెడ్డి, అశోక్ లు, ఆత్మ కమిటీ చైర్మన్ లు కచ్చూరు రావు , మల్లారెడ్డి , డిసిసిబి మాజీ డైరెక్టర్ ఆర్ రామచంద్ర రెడ్డి,సర్పంచ్ లు రామ్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**కంగ్టి, అక్టోబర్ 23, మన సాక్షి :-**



రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ను సద్వినియోగం చేసుకోవాలని గాజుల పాడ్ క్లస్టర్ ఏఈఓ గీత సూచించారు.శుక్రవారం కంగ్టి మండల వంజు తండాలో రైతులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ మేరకు ఫార్మర్ రిజిస్ట్రేషన్తో ప్రతి రైతుకు ప్రత్యేకమైన 12 అంకెల నంబర్ వస్తుందన్నారు. దీనివల్ల కేంద్ర ప్రభుత్వం అందించనున్న ప్రభుత్వ పథకాలు నేరుగా రైతులకు చేరుతాయన్నారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం రైతులు పట్టాదారు పాసుబుక్, ఆధార్ కార్డు, ఫోన్ నెంబర్ తో ఏఈఓకు అందజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## రామసముద్రం మండలంలో 101 ఎంపీటీసీ నామినేషన్ల దాఖలు

**రామసముద్రం, అక్టోబర్ 23 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో శుక్రవారం స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి మొత్తం 101 మంది ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు అధికారి మనోహర్ వెల్లడించారు. పార్టీల వారీగా టీడీపీ నుండి 36 మంది, వైసీపీ నుండి 54 మంది, జనసేన నుండి 07 మంది, బీజేపీ నుండి 02 మంది, ఇతరులు 02 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

## రామసముద్రం వైసీపీ జడ్పీటీసీ అభ్యర్థిగా వీరమ్మ నామినేషన్

**రామసముద్రం అక్టోబర్ 23 మన సాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం జడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) అభ్యర్థిగా పి. రెడ్డి వీరే గౌడ్ భార్య చిన్న వీరమ్మ నామినేషన్ దాఖలు చేశారు. నిమ్మనపల్లి రోడ్డులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో ఆమె నామినేషన్ పత్రాలను సమర్పించారు. గంపనపల్లి, పూలపాడు, రామసముద్రం, మినికి ప్రాంతాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెకు మద్దతుగా నిలిచారు. ఈ సందర్భంగా పి. రెడ్డి వీరే గౌడ్ మాట్లాడుతూ... వైసీపీ అభ్యర్థిగా చిన్న వీరమ్మ రామసముద్రం మండల జడ్పీటీసీ స్థానానికి నామినేషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

## మదనపల్లె పట్టణ సమగ్రాభివృద్ధి వైఎస్సార్సీపీతోనే సాధ్యం



**మదనపల్లె, అక్టోబర్ 23మనసాక్షి**

అన్నమయ్య జిల్లా మదనపల్లె మున్సిపాలిటీ వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థి జింకా వెంకటాచలపతికి మద్దతుగా ముమ్మర ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 4, 13, 14వ వార్డుల్లో మాజీ ఎమ్మెల్యే డా. దేశాయ్ తిప్పారెడ్డి, వైఎస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త ఎస్. నిసార్ అహ్మద్, నియోజకవర్గ పరిశీలకురాలు ఎన్. అనీషా రెడ్డి, కౌన్సిలర్ అభ్యర్థులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ప్రజా సేవకుడు జింకా వెంకటాచలపతికి ఓటు వేసి గెలిపించాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. మదనపల్లె పట్టణ సమగ్రాభివృద్ధి వైఎస్సార్సీపీతోనే సాధ్యమని స్పష్టం చేశారు.

## రామసముద్రం - 2 ఎంపీటీసీ అభ్యర్థిగా సుదర్శన్ బాబు నామినేషన్

**రామసముద్రం, అక్టోబర్ 23 మనసాక్షి**



అన్నమయ్యజిల్లా రామసముద్రం మండలం రామసముద్రం - 2 ఎంపీటీసీ స్థానానికి గబ్బురి సుదర్శన్ బాబు శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. పార్టీ శ్రేణులు, అనుచరులతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆర్ఓ మనోహర్ కు నామినేషన్ పత్రాలను సమర్పించారు.

## కమ్మవారిపల్లె ఎంపీటీసీగా వైసీపీ అభ్యర్థి విజయ్ కుమార్ నామినేషన్

**రామసముద్రం, అక్టోబర్ 23 మనసాక్షి**



అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం కమ్మవారిపల్లె గ్రామ పంచాయతీ నుండి ఎంపీటీసీ అభ్యర్థిగా వైసీపీ పార్టీ తరపున జింకల విజయ్ కుమార్ శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. అనుచరులు, పార్టీ కార్యకర్తలతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆర్ఓ మనోహర్ కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## లలితా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

**మేడ్చల్ మల్కాజిగిరి, అక్టోబర్ 23 మన సాక్షి**



ఆనంద్బాగ్లోని శ్రీ లలితా పరమేశ్వరి దేవాలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు మణికంఠ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు సంప్రదాయబద్ధంగా జరిపించారు. ఈ సందర్భంగా భక్తులు రాహుకాల దీపారాధన, శ్రీచక్ర కుంకుమార్చన, భద్ర పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి కృపాకటాక్షాలు పొందేందుకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు అని ఆలయ ఈఓ పి. శ్రీకాంత్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ సాగి సత్యనారాయణ విజయలక్ష్మి, ఆలయ కమిటీ మాజీ చైర్మన్ అమరలింగేశ్వర్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## జామియా మసీదు వద్ద వైఎస్సార్సీపీ ప్రచారం

**మదనపల్లె, అక్టోబర్ 23:మనసాక్షి**



మదనపల్లె మున్సిపల్ వైఎస్సార్సీపీ చైర్మన్ అభ్యర్థి జింకా వెంకటాచలపతి గెలుపు కోసం నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర శుక్రవారం మదనపల్లె జామియా మసీదులో వైఎస్సార్సీపీ సమన్వయకర్త ఎస్. నిసార్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి. ప్రార్థనల అనంతరం మసీదు వెలుపల ముస్లింలతో మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీ అభివృద్ధి కోసం జింకా వెంకటాచలపతి గెలుపు చారిత్రక అవసరమని నిసార్ అహ్మద్ పిలుపునిచ్చారు.అనుభవం, మున్సిపాలిటీపై అవగాహన ఉన్న వ్యక్తిగా మూడు సార్లు కౌన్సిలర్గా, మున్సిపల్ వైస్ చైర్మన్గా పని చేసిన జింకా వెంకటాచలపతిని గెలిపించి మదనపల్లె అభివృద్ధికి సోపానాలు వేయాలని కోరారు.

## పెద్దకురప్పల్లె పంచాయతీ కి జనసేన అభ్యర్థిగా మౌనిక నామినేషన్

**రామసముద్రం, అక్టోబర్ 23: మనసాక్షి**



రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ నుండి జనసేన పార్టీ అభ్యర్థిగా దేవరింటి మౌనిక శుక్రవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆమె తన అనుచరులతో కలిసి మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆర్ఓమనోహర్ కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మౌనిక మాట్లాడుతూ గ్రామ అభివృద్ధే లక్ష్యంగా పోటీ చేస్తున్నట్లు తెలిపారు.

## పెద్దకురప్పల్లె ఎంపీటీసీ కి వైసీపీ అభ్యర్థిగా కల్పన నామినేషన్

**రామసముద్రం, అక్టోబర్ 23మన సాక్షి**



రామసముద్రం మండలంలోని పెద్దకురప్పల్లె గ్రామ పంచాయతీ ఎంపీటీసీ స్థానానికి వైసీపీ పార్టీ అభ్యర్థిగా శుక్రవారం కల్పన నామినేషన్ పత్రాలను సమర్పించారు. రామసముద్రం ఎంపీడీవో కార్యాలయంలోని నామినేషన్ కేంద్రానికి చేరుకుని ఆర్వో మనోహర్ కు పత్రాలు అందజేశారు. మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో వివిధ పార్టీల అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేసారు .

## రోడ్డుపైనే వాహనాలు... ట్రాఫిక్ ఇబ్బందులు

**జహీరాబాద్, అక్టోబర్ 23,మనసాక్షి**




జహీరాబాద్ పట్టణంలోని ఇండస్ట్రీ పార్క్ వెళ్లే రోడ్డు పై ఇష్టానుసారంగా వాహనాలు నిలవడంతో ప్రజలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మెయిన్ రోడ్ నుండి ఇండస్ట్రియల్ పార్కువెళ్లే రోడ్డు ఇండస్ట్రయల్ పార్క్ తో పాటు అగ్నిమాపక కేంద్రం, ఫారెస్ట్ ఆఫీస్, ఫుగాట్ నగర్ కాలనీలకు ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు .. అయితే మెయిన్ రోడ్డునుండి ఇండస్ట్రియల్ పార్క్ కు వెళ్లే మార్గంలో రోడ్డుపై ఫుట్పాత్ వ్యాపారాలు ఉండటంతో వాహనదారులు రోడ్డు పైనే ఇష్టానుసారంగా వాహనాలను నిలబెడుతున్నారు. దీంతో ఈ రోడ్ నుంచి వెళ్లే వాహనదారులకు తీవ్రత అంతరాయం ఏర్పడుతుంది. ఒకానొక సమయంలో అంబులెన్స్ వెళ్లడానికి కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం తలెత్తినప్పుడు ఈ రోడ్డు గుండ వెళ్లెందుకు కష్టంగా ఉందని అగ్నిమాపక కేంద్రం, ఫారెస్ట్ అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపైన వాహనాలు నిలుపకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# భాగ్యశ్రీ గ్లామర్ మెరుపులు



తన అందం, అభినయంతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే మరోసారి గ్లామరస్ లుక్‌తో సందడి చేశారు. సాయి అభ్యంకర్‌తో కలిసి ఆమె నటించిన బ్రేకప్ సాంగ్ 'రాధిమా' ఇప్పటికే 10 కోట్ల వ్యూస్‌కు చేరువవుతూ ప్రేక్షకుల్లో మంచి క్రేజ్ సంపాదిస్తోంది. తాజాగా భాగ్యశ్రీ ధరించిన వైన్ మెరూన్ రంగు శాటిన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆఫ్‌షోల్డర్ నెక్‌లైన్, నడుము భాగంలో ముడతల డిజైన్, కిందివైపు సున్నితంగా పరుచుకున్న చిఫాన్ ఫ్యాబ్రిక్‌తో ఈ దుస్తులు ఆమెకు అందమైన రూపాన్ని అందించాయి. హై స్లిట్‌తో కూడిన గౌన్‌కు చిన్న పెండెంట్, చెవిపోగులు, మెరిసే చెప్పులు జతచేశారు. జుట్టును పైకి ముడివేసి సరికొత్త స్టైలింగ్‌తో అభిమానులను ఆకట్టుకున్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. శివకార్తికేయన్ సరసన తమిళ చిత్రం 'సేయోన్'లో భాగ్యశ్రీ నటించనున్నారు. శివకుమార్ మురుగేశన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంతో పాటు, ఆమె నటిస్తున్న మలయాళ సినిమా 'ఆపరేషన్ గంగా' కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది





# సంప్రదాయ చీరకట్టులో శ్రీలీల సందడి

టాలీవుడ్‌లో తనదైన నటన, అద్భుతమైన డ్యాన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటి శ్రీలీల మరోసారి సంప్రదాయ దుస్తుల్లో మెరిశారు. పండుగ సీజన్‌ను పురస్కరించుకుని ఆవిడ ధరించిన చీరకట్టు అభిమానులను ఆకట్టుకుంటోంది. 'ధమాకా', 'భగవంత్ కేసరి' చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్న ఈ భామ.. 'కిస్సిక్' పాటతో దేశవ్యాప్తంగా మరింత పాపులారిటీ సంపాదించారు. ఈసారి శ్రీలీల ఆవాల పసుపు రంగు రఫుల్స్ చీరలో కనిపించారు. అద్దాల అలంకరణతో కూడిన అంచులు, చిన్న పూల డిజైన్లు చీరకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బంగారు రంగు ఎంబ్రాయిడరీతో రూపొందించిన స్లీవ్‌లెస్ బ్లౌజ్ ఆమె అందాన్ని మరింత ఇనుమడింపజేసింది. విరబోసిన జుట్టు, సహజమైన మేకప్‌తో సంప్రదాయానికి ఆధునిక శైలిని జోడించారు. ఇక సినిమాల విషయానికొస్తే.. బాలీవుడ్ నటుడు కార్తీక్ ఆర్యన్‌తో కలిసి అనురాగ్ బసు దర్శకత్వంలో రూపొందుతున్న హిందీ రొమాంటిక్ మ్యూజికల్ చిత్రంలో శ్రీలీల నటించనున్నారు. మరోవైపు, అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్ కుమార్ నటించనున్న సినిమాలోనూ ఆమె భాగం కానున్నట్లు ప్రచారం జరుగుతోంది.





# ఆరెంజ్ డ్రెస్‌లో ఫౌజీ భామ క్యూట్ లుక్

డ్యాన్స్ రీల్స్‌తో సోషల్ మీడియాలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇమాన్వీ.. తన అందం, హావభావాలతో నెటిజన్లను ఆకట్టుకుంటున్నారు. అద్భుతమైన డ్యాన్స్‌తో ఇప్పటికే భారీ సంఖ్యలో అభిమానులను సంపాదించుకున్న ఈ భామ.. వెండితెరపై అడుగుపెట్టకముందే ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచుతున్నారు. తాజాగా ఇమాన్వీ ఆరెంజ్ రంగు స్లీవ్‌లెస్ డ్రెస్‌లో మెరిశారు. స్క్వేర్ నెక్‌లైన్, కిందివైపు విస్తరించిన డిజైన్‌తో ఉన్న ఈ దుస్తులకు జుట్టులో తెల్లని రిబ్బన్, గోల్డ్ హూప్ చెవిపోగులు జతచేశారు. పలుచని లేయర్డ్ నెక్లెస్, ఉంగరం, బ్రేస్‌లెట్‌తో తన లుక్‌ను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుకున్నారు. సహజమైన మేకప్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. ఇక ఇమాన్వీ సినీ రంగ ప్రవేశం ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'ఫౌజీ' చిత్రంతో జరగనుంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. తొలి చిత్రంతోనే వెండితెరపై ఇమాన్వీ ఎలాంటి గుర్తింపు తెచ్చుకుంటారోనని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# రూటు మార్చిన స్వీటీ..

## లేడీ ఓరియెంటెడ్ కథలకు గ్యాప్!

టాలీవుడ్ కథానాయిక అనుష్క శెట్టి (స్వీటీ) తన కెరీర్ ప్లానింగ్‌ను పూర్తిగా మార్చేసింది. 'భాగమతి' తర్వాత కేవలం లేడీ ఓరియెంటెడ్ సినిమాలే చేస్తూ వచ్చిన స్వీటీకి, ఇటీవల వచ్చిన 'ఘాటి' చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ మిగిల్చింది. దాంతో సోలోగా సినిమా భారాన్ని మోసే ఫార్ములాను పక్కనపెట్టి, భారీ తారాగణం ఉండే పెద్ద ప్రాజెక్టుల వైపు ఆమె చూపు తిప్పినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా మలయాళ స్టార్ హీరో జయసూర్య నటిస్తున్న భారీ ఫాంటసీ థ్రిల్లర్ 'కథనార్'లో అనుష్క 'నీలి' అనే కీలక పాత్ర పోషిస్తోంది. రీసెంట్‌గా వచ్చిన ట్రైలర్‌లో తన లుక్‌తో మంచి బజ్ క్రియేట్ చేసింది. సోలో సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చి, ఇలాంటి క్రేజీ మల్టీస్టారర్ కాన్సెప్ట్‌లతో మళ్లీ కమర్షియల్ ట్రాక్‌లోకి రావాలని అనుష్క భావిస్తోంది. త్వరలోనే ఆమెను మళ్లీ స్టార్ హీరోల సరసన చూసే అవకాశాలు కనిపిస్తున్నాయి.



Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.